
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5

తిరుపతి
జిల్లా వార్తలు
సోమవారం 29 జనవరి 2024



అక్రమాలన్నీ మీరు చేసి నిందలు నాపైనా?

సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ఆగ్రహం

వైసీపీలో తీవ్ర దుమారం

మంత్రి ప్రాబల్యానికి ఎదురుదెబ్బ

పెద్దిరెడ్డిపై తిరుగుబాటు



కుమారుడు సుమన్‌తో కలిసి మాట్లాడుతున్న ఆదిమూలం

> 1989లో నేను మాజీ మంత్రి చెంగారెడ్డి వద్ద ఉన్నపుడు పెద్దిరెడ్డి మోటర్ సైకిల్‌పై తిరిగేవారు. ఇపుడు ఇన్ని ఆస్తులు ఎలా వచ్చాయి?

> సత్యవేడులో ఇసుక, గ్రావెల్ అక్రమ దందాలన్నీ పెద్దిరెడ్డి కనుసన్నల్లోనే జరిగాయి. చెక్‌పోస్టుల్లో మనుషులను పెట్టి డబ్బు సంపాదించుకున్నది వాళ్లు. కానీ చెడ్డపేరు మాత్రం నాకు ఆపాదించారు.

> ఎమ్మెల్యేగా నాకింకా 80 రోజుల సమయం ఉంది. నాకు తెలియకుండా సత్యవేడు నియోజకవర్గ సమావేశాన్ని వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరుపతిలో ఎలా నిర్వహిస్తారు? ఇలా శ్రీకాళహస్తి, నగరి, తిరుపతి నియోజకవర్గాల మీటింగులను మీ ఇంట్లో పెట్టగలిగే దమ్ముందా? అసలు ఎస్సీ నియోజకవర్గంలో మీ పెత్తనం ఏమిటి? శ్రీకాళహస్తి, చెవిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రోజా నియోజకవర్గాల్లో ఇలా చేయగలరా?

> నా నియోజకవర్గంలో 33 రోడ్ల పనులను పెద్దిరెడ్డి కాంట్రాక్టు తీసుకుని ఒక్కటీ పూర్తి చేయలేదు. నాకు తెలియకుండా క్వారీలకు అనుమతులు ఇచ్చారు.

తిరుపతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆవిర్భావం నుంచీ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కొనసాగుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధిపత్యానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అధికార పార్టీకి చెందిన సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదివారం చేసిన తిరుగుబాటు రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేపింది. ప్రత్యేకించి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రకంపనలు సృష్టించింది. తిరుపతి, చంద్రగిరి వంటి ఒకటి రెండు నియోజకవర్గాలు మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాల్లోనూ సొంత వర్గాన్ని పెట్టుకుని పార్టీపై పెత్తనం చెలాయిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి వర్గాన్ని ఆదిమూలం తిరుగుబాటు కలవరపాటుకు గురి చేసింది. కొంత వెనక్కి వెళితే.. 2014లో వైసీపీ తరపున పలమనేరు, తంబళ్లపల్లె సెగ్మెంట్ల నుంచీ పోటీ చేసిన అమరనాథరెడ్డి, ఏవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పెద్దిరెడ్డి వర్గంతో సర్దుబాటు కాలేకనే పార్టీని వీడారన్న ప్రచారం అప్పట్లో జరిగింది. తిరుపతి, చంద్రగిరి మినహా మిగిలిన అన్ని సెగ్మెంట్లలోనూ అభ్యర్థుల ఎంపికలో పెద్దిరెడ్డి సిఫారసే కీలకం అన్న సంగతి బహిరంగ రహస్యమే. ప్రస్తుతానికొస్తే నగరిలో మంత్రి రోజా, జీడీనెల్లూరులో డిప్యూటీ సీఎం నారాయణస్వామి సైతం వారి సొంత నియోజకవర్గాల్లో సొంత పార్టీ నేతల నుంచీ వ్యతిరేకతను ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. వారి వ్యతిరేక వర్గాలు పెద్దిరెడ్డిని ఆశ్రయించుకుని పనులు చేసుకుంటున్నాయన్నది కూడా పార్టీలో అందరికీ తెలిసిన విషయమే. ముఖ్యంగా రోజా నియోజకవర్గంలో ఆమె వ్యతిరేకులు ఆమెను కాదని కీలక పదవులు పొందడం వెనుక పెద్దిరెడ్డి సిఫారసు ఉందన్న ప్రచారం ఉంది. తాజాగా టికెట్ల విషయానికొస్తే సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు టికెట్ వద్దని పలువురు పెద్దిరెడ్డిని కలసి ఫిర్యాదు చేయడం తెలిసిందే. అలాగే సత్యవేడులో ఎమ్మెల్యే ఆదిమూలాన్ని వద్దంటున్న వర్గం కూడా ఆయన్నే ఆశ్రయించడమూ కొత్తకాదు. మదనపల్లెలో ఎమ్మెల్యే నవాజ్ బాషా టికెట్ గల్లంతైన సందర్భంలో కూడా ఆయన పెద్దిరెడ్డి పైనే అసంతృప్తి వ్యక్తం చేసినట్టు ప్రచారం జరిగింది. పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు టికెట్ గల్లంతైనప్పుడు కూడా ఆయన నేరుగా పెద్దిరెడ్డిపైనే ఆరోపణలు చేశారు. తర్వాత మళ్లీ క్షమాపణలు చెప్పారు. ఇవన్నీ ఉమ్మడి జిల్లా వైసీపీ వ్యవహారాల్లో పెద్దిరెడ్డి జోక్యాన్ని తెలిపే ఉదంతాలే. కాకపోతే ఇప్పటి వరకూ ఎవరూ పెద్దిరెడ్డిపై ఆదిమూలం స్థాయిలో తీవ్ర ఆరోపణలు చేసింది లేదు. లోలోపల బాధపడడం, నిష్ఠూరం చేయడం తప్పితే బాహాటంగా వ్యతిరేకించింది లేదు. తాజా పరిణామాలతో ఆదిమూలం పెద్దిరెడ్డితోపాటు ఆయన కుమారుడు మిథున్‌రెడ్డి ఆధిపత్యాన్ని ప్రశ్నించడంతోపాటు అవినీతి ఆరోపణలు కూడా చేశారు. ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకాలకు కారణం నేరుగా పెద్దిరెడ్డేనంటూ ఆరోపించారు. వీటన్నింటికీ మించి ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాల్లో పెద్దిరెడ్డి పెత్తనమేమిటన్న ప్రశ్న దళిత సామాజికవర్గాలను సూటిగా తాకింది. క్రమేపీ విద్యావంతులవుతూ చైతన్యవంతంగా మారుతున్న ఆ వర్గాలను ఆదిమూలం ప్రశ్న అమాంతం కదిలించిందనే చెప్పాలి. వాస్తవంగా కూడా వైసీపీకి సంబంధించి జిల్లాలో ప్రతి ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమూ డిస్టర్బ్ అయింది. టికెట్ గల్లంతు కావడమో, లేదంటే ఇతర ప్రాంతాలకు బదిలీ కావడమో జరిగింది. దీంతో ఈ అంశం జిల్లావ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఇతర నియోజకవర్గాల్లో డిస్టర్బ్ అయిన వారు కూడా ఆదిమూలం చొరవకు లోలోపల సంతోషిస్తున్నట్టు సమాచారం. తాము చేయలేని పని ఆయన చేశారని కితాబిస్తున్నట్టు తెలుస్తోంది. వైసీపీలో ఎస్సీలకు తగిన గౌరవం లేదని ఆదిమూలం ఆవేదన వ్యక్తం చేయడం, కళ్లెదుట ఆ వాస్తవం కనిపిస్తుండడంతో జిల్లావ్యాప్తంగా దళిత సామాజికవర్గాలు ఆలోచనలో పడుతున్నాయి.

వీరిపై చర్యలు తీసుకునే ధైర్యముందా?

- ఆదిమూలం ప్రశ్నలకు ఎవరు జవాబు చెబుతారు
- టీడీపీ నేత నరసింహయాదవ్

'మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి ఇప్పిస్తామని మంత్రి రోజా రూ.40 లక్షలు తీసుకున్నారని వైసీపీకే చెందిన కౌన్సిలరు భువనేశ్వరి ఆరోపించారు. మరి, ఆమెను పదవి నుంచి బర్తరఫ్ చేసే ధైర్యం మీకుందా? నిత్యం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి భూమాయలు పత్రికల్లో వస్తున్నాయి. ఆయనపై చర్యలు తీసుకోగలరా? అంతెందుకు పాపాల భైరవుడు పెద్దిరెడ్డి రూ.35 వేల కోట్ల సహజ వనరుల ద్వారా దోచింది నిజం కాదా? ఆయనకు టికెట్ నిరాకరించే శక్తి జగన్‌కి ఉందా' అని తిరుపతి జిల్లా టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్ ప్రశ్నించారు. పిచ్చాటూరులో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. అగ్రవర్ణాల వారికి మాత్రం వారసులను ప్రకటించి దళితులకు టికెట్ లేదని కరాకండిగా చెప్పడం ఏ సామాజిక న్యాయమని నిలదీశారు. సత్యవేడు నియోజకవర్గంలో రోజుకు 200 టిప్పర్ల ఇసుక తరలించి లూటీ చేసింది పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డి అయితే.. ప్రజలతో సత్సంబంధాలు కలిగిన ఆదిమూలంపై మీ జులుం ప్రదర్శించడం ఏంటన్నారు. 'సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం అడుగుతున్న ప్రశ్నలకు జవాబు ఎవరు చెబుతారు? సజ్జలా.. సాయిరెడ్డా.. పెద్దిరెడ్డా.. ఆఖరికి జగనా' అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా జగన్ దుర్బుద్ధిని ప్రజలు గ్రహించాలని కోరారు.

- పిచ్చాటూరు

లోపాయికారి ఒప్పందంతోనే నిందలు: ఎంపీ

తిరుపతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వేరేపార్టీవాళ్లతో చేతులు కలిపి నిందలు వేస్తున్నారని తిరుపతి ఎంపీ గురుమూర్తి ఆదివారం విమర్శించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డిపై ఆయన వ్యాఖ్యలు సరికాదన్నారు. వైసీపీలో ఎస్సీలకు గౌరవంలేదని ఆయన చెప్పడం బాధాకరమన్నారు. దళితులకు ప్రాధాన్యం ఉన్నందునే ఆదిమూలానికి ప్రమోషన్ ఇచ్చి ఎంపీగా పోటీచేసే అవకాశం పార్టీ కల్పించిందన్నారు. ఎంపీ స్థానం పట్ల ఇష్టంలేకపోతే అధిష్ఠానానికి విజ్ఞప్తి చేసుకోవాలేగానీ, ఇలా రోడ్డుకెక్కడం సరికాదన్నారు. క్రమశిక్షణ చర్యలపై పార్టీ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

ప్రాజెక్టులను అటకెక్కించిన జగన్



పీసీసీ చీఫ్‌కు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ శ్రేణులు



సమావేశంలో ప్రసంగిస్తున్న షర్మిల

- మన్నవరం, హంద్రీ-నీవా, గాలేరు-నగరిని పట్టించుకోని ప్రభుత్వం
- వీటిని పూర్తి చేయని వ్యక్తి వైఎస్ వారసుడెలా అవుతాడు
- పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల విమర్శ

తిరుపతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ అభివృద్ధికి తన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన ప్రాజెక్టులన్నింటినీ జగనన్న ప్రభుత్వం అటకెక్కించిందని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. తిరుపతిలోని రామతులసి కల్యాణ మండపంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన చిత్తూరు, తిరుపతి జిల్లాల కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు ఎన్డీయే ప్రభుత్వం ద్వారా బీహెచ్ఈఎల్, ఎన్టీపీసీ సంయుక్త భాగస్వామ్యంలో రూ.6వేల కోట్ల మన్నవరం ప్రాజెక్టును ఉమ్మడి చిత్తూరు జిల్లాకు మంజూరు చేయించారని గుర్తుచేశారు. అప్పట్లో రూ.వంద కోట్లు మంజూరు చేసి, నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ శంకుస్థాపన చేశారన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఆ పరిశ్రమ అటకెక్కిందన్నారు. దీనికోసం జగనన్న ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదని ఆరోపించారు. రాయలసీమలో 6.50 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందించే హంద్రీ-నీవా ప్రాజెక్టును వైఎస్ రూ.4500 కోట్లు ఖర్చు చేసి.. 90 శాతం పనులు పూర్తి చేయించారన్నారు. పది శాతం పెండింగ్ పనులను చంద్రబాబు ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని ఎద్దేవా చేసిన నాటి ప్రతిపక్ష నేత.. తాను అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో పూర్తి చేయిస్తానన్నారని గుర్తు చేశారు. ఆయన సీఎం అయి 60 నెలలు గడుస్తున్నా 10 శాతం పనులను పూర్తి చేయలేకపోయారన్నారు. గాలేరు- నగరి ప్రాజెక్టునూ ప్రభుత్వం అటకెక్కించేసిందన్నారు. ఇలా ప్రాజెక్టులు అటకెక్కించిన జగనన్నకు.. రాయలసీమ ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉందంటే ఎలా నమ్మాలని ప్రశ్నించారు. వైఎస్ ప్రాజెక్టులను పూర్తి చేయనివారు ఆయన వారసులెలా అవుతారని నిలదీశారు. వైఎస్ మాట మీద నిలబడే నాయకుడైతే.. జగన్ మాత్రం మాట తప్పే వారని ధ్వజమెత్తారు. జగనన్న ప్రభుత్వం అదనంగా ఒక్క ఎకరాకైనా నీళ్లిచ్చిందా అని షర్మిల ప్రశ్నించారు. వైఎస్ పాలనకు, జగన్ పాలనకు ఆకాశానికి పాతాళానికీ ఉన్నంత తేడా లేదా? అని పార్టీ శ్రేణులను అడిగారు. ఎన్నికలకు సమయం తక్కువగా ఉందని రోజువారీ లక్ష్యం నిర్దేశించుకుని ప్రతి ఇంటినీ, ప్రతి మనిషినీ, ప్రతి వర్గాన్నీ కలిసేందుకు ప్రయత్నించాలని కార్యకర్తలను కోరారు. వైసీపీ, టీడీపీలను గెలిపిస్తే బీజేపీకి ఓటు వేసినట్టే అని ప్రజలకు చెప్పాలని సూచించారు. కాంగ్రెస్ గెలిస్తేనే రాష్ట్రానికి విభజన హామీలు నెరవేరుతాయని గట్టిగా చెప్పాలన్నారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన బీజేపీని, ఆ పార్టీకి బానిసలుగా మారిన టీడీపీ, వైసీపీని ఎండగట్టాలని పిలుపిచ్చారు. ఈ సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు టిక్కీ రాయల్, డీసీసీ అధ్యక్షుడు భాస్కర్ ప్రసంగించగా.. కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజు, పీసీసీ మాజీ అధ్యక్షులు రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, పీసీసీ ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి, కంచన వేణుగోపాల్ రెడ్డి, ఎన్ఎస్‌యూఐ నేత మద్దెల అమృతతేజ తదితరులు పాల్గొన్నారు. రెండు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు సమావేశానికి తరలివచ్చారు.

కొత్త కలెక్టర్‌గా లక్ష్మీషా

- హౌసింగ్ ఎండీగా వెంకటరమణారెడ్డి
- తిరుపతి నూతన కమిషనర్‌గా అదితి సింగ్



లక్ష్మీషా - అదితి సింగ్

తిరుపతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో డాక్టర్ జి.లక్ష్మీషా నూతన కలెక్టర్‌గా నియమితులయ్యారు. అలాగే తిరుపతి మున్సిపల్ కమిషనర్ డి.హరితకు స్థాన చలనం కలిగింది. ఆమె స్థానంలో అదితి సింగ్ రానున్నారు. ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా ఈ మార్పులు జరిగాయి. ప్రస్తుత కలెక్టర్ వెంకటరమణారెడ్డి.. ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా నియమితులు కానున్నారు. ఇపుడు ఎండీగా ఉన్న లక్ష్మీషా ఇక్కడికి కలెక్టర్‌గా రానున్నారు. 2013 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన లక్ష్మీశ కర్ణాటక రాష్ట్రం తుంకూరు జిల్లాలోని మారుమూల గ్రామమైన హోలుగుండనహల్లికి చెందినవారు. సివిల్స్‌లో తొలుత ఐఎఫ్ఎస్‌కు ఎంపికై హిమాచల్‌ప్రదేశ్ కేడర్‌లో పనిచేశారు. తర్వాత 2013లో మరోసారి సివిల్స్ రాసి ఐఏఎస్ సాధించి ఏపీ కేడర్ ఎంచుకున్నారు. కర్నూలులో ట్రైనీ కలెక్టర్‌గా శిక్షణ పూర్తి చేసుకున్న లక్ష్మీషా కృష్ణా జిల్లా నూజివీడు సబ్ కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ అందుకున్నారు. ఆపై పార్వతీపురం ఐటీడీఏ పీవోగానూ, తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గానూ, గ్రేటర్ వైజాగ్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రస్తుతం ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా పనిచేస్తున్నారు. ఇక తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయిన అదితి సింగ్ 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి. ఆమె విశాఖపట్టణం జిల్లాలో ట్రైనీ కలెక్టర్‌గా శిక్షణ ముగించుకుని విజయవాడ సబ్ కలెక్టర్‌గా తొలి పోస్టింగు పొందారు. అక్కడి నుంచి ఇపుడు తిరుపతి కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఇప్పటివరకూ కమిషనర్‌గా పనిచేసిన హరిత ఏపీయూఎఫ్ఐడీసీ ఎండీగా బదిలీ అయ్యారు.

శ్రీవారి చెంత పనిచేసే అవకాశం అదృష్టంగా భావిస్తున్నా

తిరుపతి కలెక్టర్‌గా శ్రీవారి చెంత పనిచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. మా స్వస్థలం కర్ణాటకలోని తుంకూరు జిల్లా. రాయలసీమకు సరిహద్దు ప్రాంతం కావడంతో ఈ ప్రాంతంపై అవగాహన ఉంది. తిరుపతి కలెక్టర్‌గా ప్రజా సమస్యల పరిష్కారానికి బాధ్యతాయుతంగా పనిచేస్తా. నాలుగైదు రోజుల్లో బాధ్యతలు స్వీకరిస్తా.

- లక్ష్మీషా

తొలి కలెక్టర్‌గా పనిచేయడం పూర్వజన్మ సుకృతం



కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లాకు తొలి కలెక్టర్‌గా పనిచేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా. కలియుగ దైవం వెంకటేశ్వరుడి పాదాల చెంత పనిచేయడానికి మించిన తృప్తి మరొకటేముంటుంది? తొలి కలెక్టర్‌గా ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నా. ముఖ్యంగా 60-70 ఏళ్లుగా 22ఏ నిషేధిత జాబితాలోని భూములతో వాటి హక్కుదారులైన పేదలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. అలాంటి భూముల సమస్య పరిష్కరించడం ఎనలేని తృప్తినిచ్చింది. జిల్లా ప్రజలు మంచివారు. విధి నిర్వహణలో అందరూ సహకరించారు. అందుకే సఫలీకృతుడిని కాగలిగా. రీ సర్వేలో కూడా గణనీయమైన పురోగతి సాధించాం. అధికారులకు బదిలీలు సాధారణం. అయితే పేదలకు మరింత మేలు చేయడానికి ఉపయోగపడే హౌసింగ్ కార్పొరేషన్‌లో పోస్టింగు రావడం అదృష్టంగా భావిస్తున్నా.

- వెంకటరమణారెడ్డి

కట్టుకున్నోడే కాలయముడు

- కత్తితో నరికి చంపేశాడు
- అడ్డొచ్చిన భార్య పిన్నిపైనా దాడి



దొరసానమ్మ (ఫైల్‌ఫొటో) - నిందితుడు శివ

ఓజిలి, జనవరి 28: కట్టుకున్నోడే కాలయముడయ్యాడు. భార్యను కత్తితో నరికి చంపేశాడు. అడ్డొచ్చిన ఆమె పిన్నిపైనా దాడి చేసి పరారయ్యాడు. ఈ దారుణ సంఘటన ఓజిలి మండలంలోని వీర్లగునుపాడులో ఆదివారం జరిగింది. నాయుడుపేట రూరల్ సీఐ జగన్మోహన్‌రావు తెలిపిన వివరాల మేరకు.. వీర్లగునుపాడుకు చెందిన దొరసానమ్మ(25)ను ఎనిమిదేళ్ల కిందట బాలాయపల్లి మండలం కోటంబేడు గ్రామానికి చెందిన వల్లూరు శివకిచ్చి పెళ్లి చేశారు. వీరికి కుమార్తె, కుమారుడున్నారు. ఏడాదిగా దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో దొరసానమ్మ పుట్టింటికి వచ్చేశారు. రెండువారాల కిందట శివ కూడా వీర్లగునుపాడుకు వచ్చాడు. ఇక్కడే పనులు చేసుకుంటూ భార్యతో సఖ్యతగా ఉంటున్నాడు. ఆదివారం పథకం ప్రకారం గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న అటవీ ప్రాంతానికి కట్టెల కోసమని దొరసానమ్మతోపాటు ఆమె పిన్ని మంజులమ్మని కూడా తీసుకెళ్లాడు. అక్కడ కట్టెలు కొట్టుకుంటూ ఉన్నట్లుగా నటిస్తూ అదను చూసి భార్యను కత్తితో నరికేశాడు. ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అడ్డొచ్చిన ఆమె పిన్నిపైనా దాడి చేశాడు. ఆమె తలకు తీవ్రగాయమైంది. అయినా ఆమె ఎలాగోలా తప్పించుకుని రోడ్డుకు సమీపంలోని కాలువ దగ్గరకు వచ్చి స్పృహ కోల్పోయింది. నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మంజులమ్మను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించి.. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. దొరసానమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించినట్లు సీఐ జగన్మోహన్‌రావు తెలిపారు.

నేడు టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం

తిరుమల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ధర్మకర్తల మండలి సమావేశం సోమవారం జరగనుంది. తిరుమలలోని అన్నమయ్య భవనంలో చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు సమావేశమై అజెండా అంశాలపై చర్చించనున్నారు. ఫిబ్రవరిలో జరగనున్న ధార్మిక సదస్సుతోపాటు ఒక్కరోజు బ్రహ్మోత్సవంగా పిలిచే రథసప్తమి ఏర్పాట్లపై చర్చించనున్నారు. అలాగే తిరుపతి, తిరుమలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ రకాల కొనుగోళ్లు, ఇంజనీరింగ్ పనులపై చర్చ జరగనుంది. ముఖ్యంగా ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో 2024-25 వార్షిక బడ్జెట్‌ను కూడా ప్రవేశపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఈ విషయాన్ని టీటీడీ గోప్యంగా ఉంచింది.



సభలో పాల్గొన్న అధికారులు

ఉపాధి సిబ్బంది పనితీరు మెరుగుపడాలి

- డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్ -

చంద్రగిరి,జనవరి28: ఉపాధిహామీ సిబ్బంది పనితీరు మరింత మెరుగుపరుచుకోవాలని డ్వామా పీడీ శ్రీనివాస్‌ప్రసాద్ అన్నారు. ఆదివారం చంద్రగిరి ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఉపాధి పనుల నివేదికలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు చంద్రగిరి మండలంలో ఉపాధి పథకం ద్వారా రూ.6.31 కోట్లతో 1075 అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. సిబ్బంది చిన్నచిన్న పొరపాట్ల వల్ల అపరాధ రుసుం వేశామన్నారు. పనపాకం, గంగుడుపల్లె, ఎ.రంగంపేట, ఐతేపల్లె, చద్రగిరి, ఏజీపల్లె ఫీల్డ్ అసిస్టెంట్‌కు వెయ్యి రూపాయలు చొప్పున, చిన్నరామాపురం, దోర్నకంబాల ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.1500 చొప్పున, బందార్లపల్లె ఫీల్డ్ అసిస్టెంట్‌కు రూ.500 చొప్పున రికవరీకి ఆదేశించారు. జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, అంబుడ్స్‌మన్ రసరాయుడు, ఎంపీడీవో బాలాజినాయక్, ఏపీడీ పద్మలత, ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, ఏపీవో జ్యోతి, చంద్రగిరి సర్పంచ్ రూపారామ్మూర్తి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మంచి చేసే నాయకులనే ఎన్నుకోవాలి

● ఎంపీ అనురాధ

తిరుమల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మనకు మంచి చేసే నాయకులను మాత్రమే ఎన్నుకోవాలని వైసీపీ ఎంపీ అనురాధ అన్నారు. ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. మాట వరసకు వచ్చి సీఎంగా ఉండి వెళ్లిపోయేవారు మనకు అవసరం లేదన్నారు. సీఎం జగన్ ఐదేళ్లలో అనేక కార్యక్రమాలు చేసి చూపారన్నారు. తాను రానున్న ఎన్నికల్లో తప్పకుండా పోటీలో ఉంటానని ఓ ప్రశ్నకు బదులిచ్చారు.

నూతన ప్రభుత్వ భవనాల ప్రారంభం

పాకాల, జనవరి 28: మండలంలోని పంటపల్లె సామిరెడ్డిపల్లె, చెన్నుగారిపల్లె, ఉప్పరపల్లె పంచాయతీల్లో ఆదివారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు. పంటపల్లెలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రం కార్యాలయాల సముదాయాన్ని ప్రారంభించారు. ఎంపీపీ లోకనాథం, వైసీపీ మండల కన్వీనర్ నంగా నరేష్ రెడ్డి, డివిజిన్ కన్వీనర్ నంగా కపిల్ రెడ్డి, సర్పంచ్‌లు సుబ్రమణ్యం, గౌరీశంకర రాజు, కళావతి, ఎంపీటీసీ కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు రైతు నేత 'పాచిగుంట' మృతి



మనోహర్‌నాయుడు (ఫైల్‌ఫొటో)

గంగాధరనెల్లూరు, జనవరి 28: తెలుగురైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాచిగుంట మనోహర్‌నాయుడు ఆదివారం సాయంత్రం మృతిచెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆదివారం ఆరోగ్య పరిస్థితి మరింతగా క్షీణించడంతో వెంటనే కుటుంబీకులు వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్సపొందుతూ ఆదివారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. ఈయనది గంగాధరనెల్లూరు మండలం పాచిగుంట గ్రామం. ఈయన తండ్రి పొదిలి సహదేవ నాయుడు గంగాధరనెల్లూరు సమితి మాజీ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన కాంగ్రెస్‌పార్టీలో కొనసాగారు. ఈయన కుమారుడు పాచిగుంట మనోహర్‌నాయుడు (పి.ఎస్.మనోహర్‌నాయుడు) కూడా కాంగ్రెస్ పార్టీతో రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టి.. అప్పటి మంత్రి చంద్రబాబునాయుడు, మాజీ ఎంపీ జ్ఞానేంద్రరెడ్డి ప్రధాన అనుచరుడిగా గుర్తింపు పొందారు. అనంతరం తన తండ్రితో కలిసి టీడీపీలో చేరారు. తూగుండ్రం సింగిల్‌విండో సొసైటీ అధ్యక్షుడిగా, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడిగా, జిల్లా తెలుగురైతు అధ్యక్షుడిగా, చిత్తూరు చక్కెరఫ్యాక్టరీ కేన్ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా పనిచేసిన ఆయన ప్రస్తుతం తెలుగురైతు రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా కొనసాగుతున్నారు. వేపంజేరి, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల్లో టీడీపీలో ప్రధాన నేతగా గుర్తింపు పొందారు. 15 ఏళ్ల కిందట ఈయన కుమార్తె వివాహానికి హాజరు కాలేకపోయిన చంద్రబాబు నాయుడు.. అనంతరం పాచిగుంటకు విచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు. నటుడు మోహన్‌బాబుతో ఉన్న సాన్నిహిత్యంతో 'మాఇంటి కథ, రౌడీగారిపెళ్ళాం, అసెంబ్లీరౌడీ' సినిమాల్లో పోలీస్‌పాత్రల్లో మనోహర్‌నాయుడు నటించారు. ఈయన పోలీస్ ఉన్నతాధికారిగా నటించిన తమిళ సినిమా ఇంకా రిలీజ్‌కాలేదు. ఏడాదిగా ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆయనకు.. కొంతకాలంగా నోటి మాట లేదు. అయినా సరే.. చంద్రబాబును జైల్లో పెట్టినప్పుడు గంగాధరనెల్లూరులో టీడీపీ నేతలు చేపట్టిన దీక్షలో రోజూ వచ్చి ఐదారు గంటలు ఉండి వెళ్లేవారు. సోమవారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు. ఈయన మృతి పార్టీకి తీరనిలోటని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా పార్టీ అధ్యక్షుడు పులివర్తినాని, జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ తదితరులు సంతాపం తెలిపారు.

ముక్కంటి సేవలో హైకోర్టు రిజిస్ట్రార్



ముక్కంటి ఆలయం వద్ద హైకోర్టు రిజిస్ట్రార్ కమలాకర్ రెడ్డి

శ్రీకాళహస్తి, జనవరి 28: ముక్కంటి ఆలయాన్ని ఆదివారం ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ కమలాకర్ రెడ్డి దర్శించుకున్నారు. శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్‌నాయక్ వారికి దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనా నంతరం గురు దక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు శేష వస్త్రంతో సత్కరించి ఆశీర్వచనం ఇచ్చారు.

'వైసీపీలో బడుగుల పట్ల వివక్ష'



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పిచ్చాటూరు, జనవరి 28: వైసీపీలో బడుగు, బలహీనుల పట్ల వివక్ష ఎక్కువగా ఉందని టీడీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు గొల్ల నరసింహయాదవ్ పేర్కొన్నారు. ఆదివారం పిచ్చాటూరు టీడీపీ పార్టీ కార్యాలయంలో టీడీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాజీ ఏఎంసీ చైర్మన్, క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆది నుంచి అధికార వైసీపీ బడుగు బలహీన వర్గాలపై వివక్ష చూపడం అందరికీ తెలుస న్నారు. ఇప్పటికైనా మనలో కను విప్పు కలగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే హేమలత, ఇన్‌చార్జి హెలెన్, టీడీపీ రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామియాదవ్, తిరుపతి జిల్లా పాలేగార్ సంఘ అధ్యక్షుడు వెంకటకృష్ణయ్య, నాయకులు గిరిబాబు, వాసు పాల్గొన్నారు.

వెండి ఆభరణాల వితరణ

చౌడేపల్లె, జనవరి28: సత్యప్రమాణాలకు పేరుగాంచిన రాజనాలబండ ఆంజనేయస్వామి ఆలయానికి దాత రావూరి గుణశేఖర్, డాక్టర్ రియ, తిరుపతి మంగళం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ షేక్ రోకియాబేగం కుటుంబ సమేతంగా స్వామి వారికి తమ మొక్కులను చెల్లించుకున్నారు. సుమారు రూ.45వేలు విలువ కలిగిన వెండి కిరీటం, కళ్లు, తదితర ఆభరణాలను స్వామి వారికి సమర్పించారు. ఈ సందర్భంగా టెంపుల్ ఇన్‌స్పెక్టర్ భానుప్రసాద్, ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి సత్కరించారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

● పులివర్తి నాని



వైసీపీ సానుభూతిపరులను పార్టీలోన ఆహ్వానిస్తున్న నాని

రామచంద్రాపురం, జనవరి 28: తమ పార్టీతోనే బీసీల అభివృద్ధి సాధ్యమని చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. ఆర్సీపురంలో ఆదివారం జరిగిన జయహో బీసీల సదస్సులో ఆయన ప్రసంగించారు. టీడీపీ హయాంలోనే బీసీలకు రిజర్వేషన్ కల్పించి 13 కార్పొరేషన్లను ఏర్పాటు చేశామన్నారు. కుల వృత్తి ఆధారంగా పనిముట్లు అందజేశామన్నారు. కోట్ల రుణాలు అందించామన్నారు. జగన్ పాలనలో కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా ఒక్క రూపాయి కూడా వారికోసం ఖర్చుచేయలేదని తెలియజేశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. తాయిలాలు ఇచ్చి ఓట్లు వేయించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ హయాం నుంచి చంద్రబాబు వరకు బీసీలకు అన్నిరంగాల్లో టీడీపీలో సముచితస్థానం కల్పించారన్నారు. జగన్ పాలనలో 75మంది బీసీ నాయకులు హత్యకు గురయ్యారని ఆరోపించారు. వందల మంది బీసీలపై పలురకాల కేసులు నమోదు చేశారన్నారు. చంద్రగిరి జనసేన ఇన్‌చార్జి దేవర మనోహర్ మాట్లాడుతూ.. టీడీపీ, జనసేన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకులు తిరుమలరెడ్డి, చిన్నబాబు, జనార్ధనచౌదరి, ఉమాపతినాయుడు, హరి ప్రసాద్, నరసింహారెడ్డి, డిల్లీనాథరెడ్డి, ధనంజయరెడ్డి, బీసీ నాయకులు నాదమునియాదవ్, సుబ్రహ్మణ్యం యాదవ్, భాస్కర్, మాధవయ్య, ప్రకాష్, వాసు, జనసేన మండలాధ్యక్షుడు సంజీవ హరి పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

గంగిరెడ్డిపల్లి, నెన్నూరు గ్రామాల నుంచి 20మంది వైసీపీ సానుభూతిపరులు పులివర్తిన నాని సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి ఆయన టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మున్నా, దినేష్‌రెడ్డి, షాహిదా, వాసురెడ్డి, రాజారెడ్డి, సురేష్, కిరణ్, దేశమ్మ తదితరులు ఉన్నారు.

టీడీపీ బీసీ గర్జనను విజయవంతం చేయండి

ఎర్రావారిపాలెం, జనవరి 28: ఈనెల 31వ తేది జరగనున్న టీడీపీ గర్జనను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి అన్నాసముద్రం మధుసూదన్ పిలుపునిచ్చారు. ఎర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు మండలాలకు సంబంధించి ఎర్రావారిపాలెంలోని తలకోన రోడ్డులో సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండల టీడీపీ నాయకులు దేశిరెడ్డి రఘునాథ, ప్రధాన కార్యదర్శి మహేష్ నాయుడు, కొమ్మాక లక్ష్మి, మల్లారు దేవి, హరిశ్చంద్ర, శ్రీనివాసులు, దేశిరెడ్డి శేషు నాయుడు, విశ్వనాథరెడ్డి, సుధాకర్ నాయక్, గోపీ నాయుడు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఎద్దులను నిలువరిస్తున్న యువకులు



పశువుల పండుగను ప్రారంభిస్తున్న పులివర్తి వినీల్

రంకేసిన కోడెగిత్తలు

చంద్రగిరి, జనవరి 28: చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీ బోడిగుట్టవారిపల్లెలో ఆదివారం పశువుల పండుగను కోలాహలంగా నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి, పశువులను, కోడెలను తీసుకొచ్చి అలంకరించి, బహుమతులు కట్టారు. గ్రామ దేవతలకు పూజలు చేసి, గ్రామంలో పశువులను వదిలారు. యువకులు ఉత్సాహంగా పాల్గొని ఎద్దులను నిలువరించే ప్రయత్నం చేసి బహుమతులు చేజిక్కించుకున్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. టీడీపీ యువ నాయకుడు పులివర్తి వినీల్ తదితరులు విచ్చేశారు.

ఉత్తిలివంకలో..





రామచంద్రాపురం, జనవరి 28: అనుపల్లె పంచాయతీ ఉత్తిలివంక గ్రామంలో ఆదివారం ఉత్సాహంగా జల్లికట్టు జరిగింది. గ్రామస్తులు వారం నుంచి తమ కోడెగిత్తలను జల్లికట్టుకు సిద్ధం చేశారు. రాజకీయ నాయకుల, దేవుళ్ల ఫొటోలతో పాటు విలువైన బహుమతులను కోడెగిత్తల కొమ్ములకు కట్టి అల్లిలోకి వదిలారు. వాటిని నిలువరించి బహుమతులు అందుకునేందుకు యువకులు పోటీపడ్డారు. ఈ క్రమంలో కొందరికి స్వల్పగాయాలయ్యాయి. దీన్ని తిలకించడానికి మండలంలోని పరిసర గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. వీరికి గ్రామస్తులు భోజన వసతి కల్పించారు.

పవిత్ర మృతిపై వీడిన మిస్టరీ...!

● పథకం ప్రకారమే హత్య ● నీటిలో ముంచి కడతేర్చిన భర్త

శ్రీకాళహస్తి, జనవరి 28: శ్రీకాళహస్తీశ్వరాలయం సమీపంలోని స్వర్ణముఖి నదిలో అనుమానాస్పదంగా మృతిచెందిన పవిత్ర ఘటనలో మిస్టరీ వీడింది. వివరాల్లోకి వెళితే... వరదయ్యపాళెంకు చెందిన లారీ డ్రైవర్ శ్రీనివాసులు(55), భార్య పవిత్ర (36) తలపై దాడి చేసి గాయపరిచాడు. తిరుపతిలో చికిత్స పొంది 13రోజుల తర్వాత ఆమె డిశ్చార్జ్ అయింది. ముక్కంటి ఆలయం దర్శించుకుని ఇంటికి వెళదామంటూ ఈ నెల 26వ తేదీ శ్రీనివాసులు భార్యను శ్రీకాళహస్తికి తీసుకొచ్చాడు. ఎలాగైనా భార్యను హతమార్చాలని పతకం వేశాడు. మాయ మాటలతో ఆలయం సమీపంలోని చిమ్మచీకట్లో నిర్మానుష్యంగా ఉండే స్వర్ణముఖి నదిలోకి తీసుకెళ్లాడు. నీటిలో ముంచి భార్యను హతమార్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ తర్వాత ఆమెది సహజ మరణంగా చిత్రీకరించేందుకు నీటిలో పడి భార్య చనిపోయిందంటూ నమ్మించే ప్రయత్నం చేశాడు. తొలి నుంచి అతడి ప్రవర్తన తెలిసిన కుటుంబ సభ్యులు మాత్రం శ్రీకాళ హస్తి 1టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ నరసింహారావు కేసు నమోదు చేశారు. మృతురాలి మెడపై గాయాలు ఉన్నట్లు పోస్టుమార్టం సమయంలో వైద్యులు గుర్తించారు. దాని ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో భర్తే చంపేసినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు పక్కా సమాచారం. త్వరలో అరెస్టు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించనున్నారు.

కురకాల్వలో ఆక్రమణల తొలగింపు



ప్రజలో మాట్లాడుతున్న వైసీపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి

రేణిగుంట, జనవరి28: రేణిగుంట మండలం జీపాళెం పంచాయతీ పరిధి లోని కుర్రకాలువ రెవెన్యూ లెక్కదాఖలా సర్వే నెంబరు 213-3లో వున్న ఖాళీ స్థలంలో అక్రమంగా నిర్మించిన నిర్మా ణాలను ప్రజలు స్వచ్ఛందంగా తొలగిం చారు. వారికి కొందరు వైసీపీ నాయ కులు అండగా నిలిచారు. అయితే ఆక్రమలు తొలగించరాదని మరో వర్గం వైసీపీ నాయకులు పోలీసులను ఆశ్రయించడంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆక్రమణలు తొలగించిన వారితో చర్చలు జరిపారు. సమస్య ఉంటే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలని ఇలా తొలగించడం తగదని స్పష్టం చేశారు. దీంతో పంచాయితీ పోలీసు స్టేషన్‌కు చేరింది. అక్కడ వైసీపీ నాయకులు డీసీసీబీ మాజీ చైర్మన్ ఎస్.సుధాకర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యులు తిరుమలరెడ్డి మాట్లాడుతూ ఆక్రమణలు తొలగిస్తే అడ్డుకోవడం తగదన్నారు. పంచాయతీలో అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేసేందుకు రెవెన్యూ వారితో మాట్లాడి సమస్య పరిష్కరిం చాలని కోరారు. అనంతరం సీఐ సుబ్బరాయుడుకు వినతిపత్రం అందజేశారు. గతంలో పట్టాలు పొందిన వారికి నాలుగు రోజుల్లో ఇంటి స్థలాలు చూపకపోతే తామే ప్రభుత్వ స్థలాలు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని

ఇద్దరు శ్రీవారి భక్తుల దుర్మరణం



వరదన్ మృతదేహం

నారాయణవనం, జనవరి 28: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు శ్రీవారి భక్తులు దుర్మరణం చెందిన ఘటన నారాయణవనం మండలం రాళ్ల కాలవ వద్ద ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్ఐ పరమేష్ నాయక్ కథనం మేరకు.... తమిళనాడుకు చెందిన మోహన్, వరదన్ శ్రీవారి దర్శనం కోసం కాలినడకను తిరుమలకు బయలుదేరారు. ఆదివారం ఉదయం నారాయణవనం మండలం రాళ్ల కాలవ వద్ద వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మోహన్ అక్కడిక్కడే మృతి చెందగా, వరదన్ తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని స్థానికులు పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేలవంగా 'వైసీపీ సాధికార సభ'



జనాలు వెళ్లిపోవడంతో పలచబడ్డ సభా ప్రాంగణం, (ఇన్‌సెట్లో) ప్రసంగిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కోట, జనవరి 28: కోట పట్టణంలో ఆదివారం రాత్రి జరిగిన వైసీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర సభ పేలవంగా ముగిసింది. గూడూరు నియోజకవర్గ స్థాయిలో సభను ఇక్కడ పెట్టి ఐదు మండలాల నుంచి జనాలను తరలించారు. అయితే నాయకులు ప్రసంగాలు మొదలుపెట్టేలోపే సభా ప్రాంగణం నుంచి వచ్చిన జనం వచ్చినట్లుగా మెల్లమెల్లగా వెళ్లిపోయారు. మిగిలినవారికే వైసీపీ నాయకులు ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చి ముగించారు. రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు బి.మస్తాన్‌రావు, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మేరిగ మురళి, బల్లి కల్యాణ్, నాయకులు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, కొడవలూరు ధనంజయరెడ్డి, నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనానికి ఇక్కట్లు



బోసిపోయిన ఆర్టీసీ బస్టాండు

సభ ఏర్పాటు చేసిన కోట బజారు సెంటరు ఇరుకు ప్రాంతం. ఇక్కడ ఇరువైపులా అంగళ్లకు ఓవైపు వైసీపీ నాయకులు ఫ్లెక్సీలు, కటౌట్లు కట్టేయగా, మరోవైపు పోలీసులు బ్యారికేడ్లు పెట్టడంతో దుకాణాలనూ మూత వేయాల్సి వచ్చిందని వ్యాపారులు వాపోయారు. ఇక మధ్యాహ్నం 11 గంటల నుంచే బస్టాండులోకీ బస్సులనూ రానీయలేదు. దీనివల్ల జనానికి ఇక్కట్లు తప్పలేదు.

నమ్మి అప్పగిస్తే.. ఇంత నిర్లక్ష్యమా

● తుడ నిర్వాకంపై రెవెన్యూ అసంతృప్తి
● కరకంబాడిలో ఆక్రమణలపై ఆగ్రహం



గుడిసెలు వేసిన పేదలతో చర్చిస్తున్న తహసీల్దార్ ఉదయ్‌సంతోష్, పోలీసులు (ఫైల్‌ఫొటో)

రేణిగుంట, జనవరి28: నమ్మి భూములు అప్పగిస్తే నిర్లక్ష్యం వహించిన తుడాపై రేణిగుంట రెవెన్యూ అధికారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కరకంబాడిలో మూడు రోజులుగా ప్రభుత్వ భూమిలో పేదలు గుడిసెలు వేయడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. రేణిగుంట మండల పరిధిలోని కరకంబాడి పంచాయతీ కార్యాలయానికి సమీపంలో కడప రహదారికి ఆనుకుని ఉన్న కరకంబాడి లెక్కదాఖలా సర్వే నెంబరు 153/1 లో 70.70 ఎకరాలను 2009 నవంబరులో తుడాకు రెవెన్యూ అధికారులు కేటా యించారు. ఆ భూమిని అభి వృద్ధి చేసి ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ ఇప్పటివరకు తుడ పాలక మండలి చిన్న అభివృద్ధి పని కూడా చేయలేదు. కనీసం తుడ బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. కనీసం తమకు అప్పగించిన స్థలాలు ఆక్రమించుకుంటున్నా పట్టించు కోవడం లేదు. అదే సమయంలో రేణిగుంట మం డలం నుంచి తుడకు లక్షల రూపాయల నిధులు జమచేస్తున్నారు. తుడ పాలక మండలి మాత్రం తమకు అనుకూలమైన ప్రాంతంలోనే వివిధ అభి వృద్ధి పనులు చేసుకుంటోందనే విమర్శలున్నాయి.

రెవెన్యూ అధికారుల సతమతం

తుడా నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకొని కొందరు నకిలీ భూహక్కు పత్రాలను సృష్టించి కబ్జాలకు పాల్పడుతున్నారు. 14 ఏళ్లుగా తుడ పాలకమండలి ఈ భూమిని అభివృద్ధి చేయకపోవడంతో లక్షల విలువ చేసే గ్రావెల్‌ను కొందరు సొమ్ము చేసుకున్నారు. ఇదే సమయంలో ప్రభుత్వం మూడేళ్ల క్రితం జగనన్న ఇంటిపట్టాలు పేదలకు పంపిణీ చేసింది. అందులో సుమారు 4వేలకు పైగా లబ్ధిదారులకు నేటివరకు ఇంటి స్థలాలు చూపలేదు. దీంతో కరకం బాడి గుట్టపై పేదలు సీపీఎం ఆధ్వర్యంలో గుడిసెలు వేశారు. రెవెన్యూ అధి కారులు పోలీసుల సాయంతో ఆ గుడిసెలు తొలగిం చారు. అయితే ఆ భూమిని పొందిన తుడ అధికారులు గానీ, పాలక మండలి గానీ అటువైపు కన్నెత్తి చూడలేదు. ఇటు అప్పగించిన భూమిని కాపాడు కోవడంతో పాటు పట్టాలు పొందిన వారికి స్థలాలు చూపడం రెవెన్యూ అధికారులకు సమస్యగా మారింది. ఇప్పటికైనా తుడ వారు స్పందించి కరకం బాడి గుట్టను అభివృద్ధి చేసి రక్షణ కల్పించాల్సి ఉంది. అలాగే పట్టాలు పొందిన వారికి రెవెన్యూ వారు స్థలాలు చూపాల్సి ఉంది.

అధికార దుర్వినియోగంతో

వ్యవస్థలు నాశనం

మాజీమంత్రి అమరనాథరెడ్డి

పెద్దపంజాణి. జనవరి 28: సీఎం జగన్ అధికార దుర్వినియోగానికి పాల్పడి వ్యవస్థల్ని నాశనం చేశారని మాజీ మంత్రి అమరనాథరెడ్డి విమర్శించారు. ఆదివారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఆయన పెద్దపంజాణి మండలంలోని బొమ్మరాజుపల్లె, వలసపల్లె, కుంట్లకింద, అమ్మరాజుపల్లె, వడ్డూరు. ముదరంపల్లె గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అవినీతిని ఎండగట్టారు. ఆయన మాట్లాడుతూ అవగాహనలేని వ్యక్తులకు అధికారం కట్టబెట్టడంతో రాష్ట్రం అంధకారంలోకి పోయిందన్నారు. కొత్తపరిశ్రమలు రాకపోగా ఉన్న పరిశ్రమలు రాష్ట్రం నుంచి వెళ్ళగొట్టారన్నారు. దీంతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో పక్కరాష్ట్రాలకు తరలిపోతున్నారన్నారు. అప్పు చేస్తే తప్పా ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితికి రాష్ట్రాన్ని తీసుకువచ్చారన్నారు. నాడు-నేడుతో గోడలకు రంగులేసి కోట్లరూపాయలు దండున్నారన్నారు. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిన మీరు సిగ్గుతో తలవంచుకునే రోజు దగ్గరలో ఉందన్నారు. అనంతరం ముదరంపల్లె గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు సుబ్రమణ్యంరెడ్డి, సి.సుబ్రమణ్యం, శంకర్, గంగాధర్, వెంకటరత్నం, కృష్ణప్ప తదితరులు టీడీపీలో చేరారు. మండల పార్టీ అధ్యక్షుడు ఆనంద్, ప్రధాన కార్యదర్శి చలపతి, మాజీ ఎంపీపీ మురళీకృష్ణ, సర్పంచ్ రుద్రమూర్తినాయుడు, నాయకులు మురహరిరెడ్డి, నాగరాజరెడ్డి, శివాడి నాగరాజ, గంగప్ప, వేమారెడ్డి, వేణుగోపాల్‌నాయుడు, ముబారక్‌తాజ్, రెడ్డెప్పరెడ్డి, హరినాథరెడ్డి, గణపతి, జయరాంరెడ్డి, శ్రీరాములు, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.



అమరనాథరెడ్డికి మంగళహారతులు పడుతున్న మహిళలు

ఉమ్మడి చిత్తూరులో ఏడు ఉత్తమ హరిత పాఠశాలల ఎంపిక

స్టేట్ కో-ఆర్డినేటర్ నీలకంఠయ్యకు జాతీయ అవార్డు



తిరుపతి(విద్య), జనవరి 28: ఏపీ నేషనల్ గ్రీన్ కోర్, సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్(ఢిల్లీ) ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రీన్‌స్కూల్ ప్రోగ్రామ్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఉత్తమ హరిత పాఠశాలలుగా 7 హైస్కూల్స్ ఎంపికయ్యాయి. రాష్ట్రంలో 3,450స్కూల్స్ నమోదు చేసుకుని, ఇప్పటి వరకు 900కిపైగా గ్రీన్ ఆడిటింగ్‌ను సమర్పించినట్లు గ్రీన్ స్కూల్ ప్రోగ్రామ్ రాష్ట్ర కోఆర్డినేటర్ పి.నీలకంఠయ్య పేర్కొన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో ఉత్తమ హరిత విభాగంలో 12 స్కూల్స్ ఎంపికవగా..అందులో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏడు ఉన్నట్లు వివరించారు. కాగా ల్యాండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో వాల్మీకిపురం మండలంలోని గండబోయినపల్లె జెడ్పీహెచ్ఎస్ అవార్డుకు ఎంపికైంది. ఈ ప్రోగ్రామ్‌ని క్షేత్రస్థాయిలో ముందుకు తీసుకెళ్తున్న స్టేట్ కోఆర్డినేటర్, కరకంబాడి జెడ్పీహెచ్ఎస్ బయాలజీ టీచర్ పి.నీలకంఠయ్యను జాతీయ స్థాయిలో ఉత్తమ కోఆర్డినేటర్‌గా ఎంపిక చేశారు. ఈనెల 30న న్యూఢిల్లీలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డు, ధ్రువపత్రాలను అందిస్తారు. నీలకంఠయ్యను గ్రీన్‌స్కూల్ ప్రోగ్రామ్ స్టేట్ డైరెక్టర్ పి.స్రవంతి, జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ వి.శేఖర్ అభినందించారు.

● ఉత్తమ హరిత విభాగంలో ఎంపికైన పాఠశాలలు : జెడ్పీహెచ్(గండబోయినపల్లె, వాల్మీకిపురం మండలం), జెడ్పీహెచ్ఎస్(మద్రిపాడు, గుర్రంకొండ మండలం), జెడ్పీహెచ్ఎస్(తవణంపల్లె), జెడ్పీహెచ్ఎస్(ఆర్కే ఎంపురం, వెదురుకుప్పం మండలం), జెడ్పీహెచ్ఎస్(కల్లూరు), జెడ్పీజీహెచ్ఎస్(నారాయణవనం), జెడ్పీహెచ్ఎస్(పాలమంగళం).

క్రీడా మైదానంలో నిర్మాణాలు వద్దు



కరుణాకరరెడ్డికి విన్నవిస్తున్న పూర్వవిద్యార్థుల బృందం

తిరుపతి(కొర్లగుంట), జనవరి 28: శ్రీవేంకటేశ్వర ప్రాథమికోన్నత పాఠశాల మైదానంలో నిర్మాణాలు చేపట్టవద్దని పూర్వ విద్యార్థుల బృందం టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి విన్నవించారు. ఎస్వీ హైస్కూల్ గ్రౌండ్‌లో ప్రస్తుతం టీటీడీ ఆధ్వర్యంలో ఎస్వీ నృత్య కళాశాల భవన విస్తరణ పనులు మొదలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం టీటీడీ చైర్మన్‌ను ఆయన నివాసంలో కలిసి వందేళ్ల చరిత్ర కలిగిన పాఠశాల క్రీడా మైదానంలో ఇప్పటికే వాణిజ్య సముదాయం నిర్మించారని, తాజా కట్టడాల వల్ల క్రీడాకారులకు ఇబ్బందులు తలెత్తుతాయని చెప్పారు. ఇలాగే కొనసాగితే మైదానం ఉనికి కోల్పోతుందన్నారు. చైర్మన్ స్పందిస్తూ టీటీడీకి సంబంధించిన మైదానంలో పూర్వ విద్యార్థుల ప్రమేయమేంటని, నృత్య కళాకారులకు స్థలాభావం రీత్యా మైదానానికి సంబంధం లేకుండా ఖాళీ జాగాలో అదనంగా భవనం నిర్మాణం చేపడుతున్నామని ఆయన చెప్పినట్లు తెలుస్తోంది.

శారదపీఠం భవన నిర్మాణాలు నిలిపేయాలి



కరపత్రం చూపుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 28 : తిరుమలలో విశాఖ శారదాపీఠం చేపట్టిన సెవెన్‌స్టార్ బిల్డింగ్ అక్రమ నిర్మాణం నిలిపివేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు నీరుగట్టు నగేష్ డిమాండ్ చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ టీటీడీ నిబంధనలకు విరుద్ధంగా తిరుమలలో కట్టడాలు చేపట్టడం బాధాకరమన్నారు. హైకోర్టు అడ్వకేట్ కమిషనర్‌ను పంపడం తిరుమల చరిత్రలో ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. సనతాన ధర్మాలను, హిందూ సంప్రదాయాలను కాపాడుతూ భగవంతుడి దర్శనానికి వచ్చే భక్తులకు సేవలందించాల్సిన కొన్ని పీఠాలు టీటీడీ నిబంధనలు పాటించకుండా రాజకీయ పలుకుబడితో ఇష్టానుసారంగా వ్యవహరించడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందన్నారు. టీటీడీ వ్యవస్థను ఉద్యోగులు తప్పుదారి పట్టిస్తున్నారని, తక్షణమే ఈ అక్రమ భవనాలను తొలగించాలని, లేకపోతే భక్తులతో కలిసి నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు బొంతల రాజేష్ రాయల్, వెంకటా చలపతి, కోడివాక చందు, కందనూరు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అప్సా జిల్లా నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న సుబ్రమణ్యంరాజు

తిరుపతి (విద్య), జనవరి 28 : ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు వి.సుబ్రమణ్యం రాజు పేర్కొన్నారు. అధ్యక్షుడిగా తిరుపతికి చెందిన బాబా విద్యానికేతన్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ లెక్కల రమేష్‌బాబు, కార్యదర్శిగా పగడాల లోకేష్(అక్షర హైస్కూల్), అదనపు ప్రధాన కార్యదర్శిగా గంగయ్య(సాయిరామ్ స్కూల్), కోశాధికారిగా అనిల్(బాపూజీ స్కూల్), ఇతర జిల్లా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నామని ప్రకటించారు. నూతన కార్యవర్గ ప్రతినిధులు మాట్లాడుతూ సంఘ బలోపేతానికి మరింతగా కృషి చేస్తామని తెలిపారు.

ఆర్థోపెడిక్ సర్జన్స్ సొసైటీ అధ్యక్షుడిగా సునందకుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సునందకుమార్‌రెడ్డి

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 28 : ఆర్థోపెడిక్ సర్జన్స్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(ఓఎస్ఎస్ఏపీ) అధ్యక్షుడిగా ప్రముఖ ఆర్థోపెడిక్, ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సునందకుమార్‌రెడ్డి ఎన్నికయ్యారు. తిరుపతి శ్రీకన్వెన్షన్‌లో మూడు రోజుల పాటు జరిగిన ఆర్థోపెడిక్ సర్జన్స్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సదస్సులో దక్షిణాది రాష్ట్రాల నుంచి 1,200మంది వైద్యులు హాజరయ్యారు. ఆర్థోపెడిక్‌లో వచ్చిన సంస్కరణల గురించి చర్చించారు. చివరి రోజు డాక్టర్ సునందకుమార్‌రెడ్డిని ఓఎస్ఎస్‌పీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. వచ్చే ఏడాది వరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. కార్యదర్శిగా కర్నూలుకు చెందిన డాక్టర్ విజయకృష్ణ ఎన్నికయ్యారు. చివరిరోజు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి హాజరయ్యారు. డాక్టర్ సునందకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పదవి మరింత బాధ్యత పెంచిందన్నారు. నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు హేమకుమార్, దీపక్, వెంకట్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.92 కోట్లు

తిరుమల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.92 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 76,104 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 32,412 మంది తలనీలాలు సమర్పించారు.

ఏబీవీపీ నూతన కార్యవర్గం ఎన్నిక



నరేంద్ర - సందీప్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 28: ఏబీవీపీ ఎస్వీయూ నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా నరేంద్ర, కార్యదర్శిగా సందీప్, ఉపాధ్యక్షుడిగా నాగరాజు, సహాయ కార్యదర్శిగా దివాకర్, ఉపాధ్యక్షుడిగా శంకర్, సోషల్ మీడియా కన్వీనర్‌గా కేదార్, హాస్టల్ ఇన్‌చార్జిగా దివాకర్, స్పోర్ట్ ఇన్‌చార్జిగా శేఖర్ నియమితులయ్యారు. వీరిని నాయకులు వెంకటరమణయ్య, సుమన్, రాఘవేంద్ర అభినందించారు.

వైసీపీలో యాదవులకు సముచిత స్థానం

యాదవ కురబ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి

తిరుపతి (రవాణా), జనవరి 28 : వైసీపీలో యాదవులకు సముచిత స్థానాన్ని కల్పించామని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అన్నారు. ఆదివారం తిరుపతి నగర పరిధిలోని లీలామహల్ కూడలి సమీపంలో గల ప్రైవేటు కల్యాణ మండపంలో యాదవ కురబ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కులాన్ని రాజకీయం చేసే ఆచారం తమకు లేదన్నారు. తాను సమాజానికి సమూహానికి మేలు చేయాలనుకునే వాడినన్నారు. తిరుపతి నగరం ఎంతో అభివృద్ధి చెందుతోందని, అందరూ కలిసికట్టుగా ఉంటూ అభినయ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని కోరారు. మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ వైసీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త అభినయ్ ప్రసంగించారు. ఆర్టీసీ యూనియన్ నాయకుడు ఆవుల ప్రభాకర్‌యాదవ్ మాట్లాడుతూ ప్రపంచంలోనే వైసీపీ లాంటి పార్టీ కానీ, జగన్ వంటి నాయకుడు లేడని వ్యాఖ్యానించారు. అభినయ్‌రెడ్డిని సూర్యభగవానుడితో పోల్చారు.

అన్నా సోదరులు గైర్హాజరు..

ఆత్మీయ సమావేశానికి యాదవ సామాజిక వర్గంలో ప్రధానంగా ఉండే అన్నా సోదరులు హాజరుకాలేదు. వారి కుమార్తెలు, కార్పొరేటర్లు అన్నా సంధ్య, అన్నా అనిత హాజరయ్యారు. 2019 ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేసిన అన్నా రామచంద్రయ్యయాదవ్, అన్నా రామకృష్ణయాదవ్(అన్నదమ్ములు) హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

తిరుపతి

శ్రీరామ సేవకులకు అభినందన

తిరుపతి(కొర్లగుంట), జనవరి 28 : అయోధ్య అక్షింతలను ప్రతి ఇంటికీ చేర్చడంలో కృషి చేసిన సేవకులను అభినందిస్తున్నట్లు విశ్వహిందూపరిషత్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ భరణీకుమార్ తెలిపారు. ఎమ్మార్‌పల్లిలోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో ఆదివారం జిల్లాశాఖ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 130 మంది సేవకులు అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు, ఇతర పూజా సామగ్రి పంపిణీని దిగ్విజయం చేశారని సంతృప్తి చెందారు. ఈ సమావేశంలో విశ్వహిందూ పరిషత్ నగరాధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు, నాగరాజు శర్మ, రాజేంద్రనాథ్‌రెడ్డి, రమాదేవి, రేఖ పాల్గొన్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు



సన్నారెడ్డి - శివరామిరెడ్డి

తిరుమల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో శ్రీసిటీ ఎండీ రవి సన్నారెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.





విజేతలకు బహుమతుల పంపిణీ - పుస్తకాలను తిలకిస్తున్న నగరవాసులు

ఈ-పుస్తకాలకు పెరుగుతున్న ప్రాధాన్యం

పుస్తక ప్రదర్శన ముగింపు సమావేశంలో వీసీ భారతి



అతిథులను సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి (కల్చరల్), జనవరి 28 : మారుతున్న కాలంలో ఈ-పుస్తకాలు విశ్వవ్యాపితంగా ప్రాముఖ్యత సంతరించుకుంటున్నాయని, ముద్రణారంగం భవిష్యత్తు అంత ఆశాజనకంగా లేదని మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డి.భారతి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, భారతీయ విద్యాభవన్ ఆధ్వర్యంలో జరుగుతున్న 16వ వార్షిక పుస్తక ప్రదర్శనలో ఆదివారం చివరి రోజు సమాపనోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పాఠకులను, ప్రచురణకర్తలను ఒకచోట చేర్చడానికి ఇటువంటి పుస్తక ప్రదర్శనల ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. నేరుగా ఇన్ని వేల పుస్తకాలను చూడడం, పేరుపొందిన రచయితలు, విద్వాంసులను కలుసుకోవడం ద్వారా కొత్త పాఠకులు వస్తారన్నారు. గౌరవ అతిథి, స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్.వి.కుమార్ మాట్లాడుతూ భారతీయ సంప్రదాయంలో పుస్తకానికి చాలా చరిత్ర ఉందన్నారు. తాను తన తండ్రి నుంచి పుస్తకాలను చదవడం, వాటిని సున్నితంగా వినియోగించడం, జాగ్రత్త చేయడం వంటి మంచి అలవాట్లు నేర్చుకున్నానని తెలిపారు. రామకృష్ణ ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానంద మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యావిధానం కోసం పుస్తక పఠనం ఎంతో అవసరమన్నారు. తిరుపతి పుస్తక ప్రదర్శన ద్వారా ఈ ప్రాంతంలో చదువుకునే అలవాటు పెరుగుతోందన్నారు. ఈ సభకు భారతీయ విద్యాభవన్ సంచాలకులు డాక్టర్ నడింపల్లి సత్యనారాయణ రాజు అధ్యక్షత వహించారు. తొమ్మిది రోజులుగా పుస్తక ప్రదర్శనలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల విజేతలకు అతిథులు బహుమతులను అందించారు. చివరగా ఆచార్య సింగిరాజు దక్షిణామూర్తి వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. చివరి రోజు కావడంతో ఆదివారం పుస్తక ప్రదర్శనకు ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు.

టీటీడీ పాలకమండలిని భగవంతుడు క్షమించడు

సీపీఐ ఎమ్మెల్యే సాంబశివరావు



దీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 28: టీటీడీ యాజమాన్యాన్ని, పాలకమండలిని భగవంతుడు కూడా క్షమించడని సీపీఐ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. టీటీడీ అటవీ కార్మికుల రెండో రోజు నిరవధిక దీక్షలో ఉన్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళిని, కార్మికులను ఆయన పరామర్శించి, రెడ్ సెల్యూట్ చేశారు. 1,159రోజులుగా టీటీడీ అటవీ కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేస్తుంటే టీటీడీ యాజమాన్యం ఏం చేస్తోందని ప్రశ్నించారు. కరుణాకరరెడ్డి లాంటి వ్యక్తి టీటీడీ చైర్మన్‌గా ఉన్నా ఆమరణ నిరాహారదీక్షలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందంటే పరిస్థితి ఏపాటిదో అర్థమవుతోందన్నారు. తక్షణం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అటవీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి పోరాటం, అధికార పార్టీ అవకాశవాదం తదితర అంశాలతో సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు పాడిన ఉయ్యాల-ఉయ్యాల పాట ఆకట్టుకుంది. అంగన్వాడీ యూనియన్ నేత నాగరాజమ్మ ఆధ్వర్యంలో మహిళలు కోలాటం, గొబ్బెమ్మ పాటలను దీక్షా శిబిరం ఎదుట ప్రదర్శించారు. చంద్రశేఖర్ భాగవతార్ ఆధ్వర్యంలో అన్నమాచార్య కళాకారులు కచేరి నిర్వహించారు. రమాదేవి హాస్పిటల్ తరపున వైద్యులు, సిబ్బంది శిబిరం వద్దకు చేరుకుని దీక్షలో ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బాలసుబ్రహ్మణ్యం, నగర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్యం ఆందోళనకరం

టీటీడీ అటవీ కార్మికులకు మద్దతుగా నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టిన కార్మిక నేతలు కందారపు మురళి సహా కార్మికుల ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని డాక్టర్ కిషోర్ ప్రకటించారు. ఆదివారం రాత్రి వైద్య పరీక్షలు నిర్వహించిన ఆయన షుగర్ లెవల్స్ పడిపోయాయని, బీపీ ఆందోళనకరంగా ఉందని తెలిపారు. తమ ఆరోగ్య పరిస్థితి ఎలా ఉన్నా దీక్షలు విరమించేది లేదని, సమస్య పరిష్కారమయ్యే కొనసాగిస్తామని భీష్మించారు.

జగన్‌కు మిగిలింది 74 రోజులు మాత్రమే : టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహయాదవ్

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 28: సీఎం జగన్‌కు మిగిలింది 74 రోజులు మాత్రమేనని, వైసీపీని ఓడించేందుకు జనం సిద్ధంగా ఉన్నారని టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ విమర్శించారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ జగన్ ఎన్నికలకు సిద్ధమవుతుంటే ప్రజలు ఆయనకు స్వస్తి పలికేందుకు తయారవుతున్నారని తెలిపారు. వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, వెనుకబడిన కులాలు, మైనార్టీలు నలిగిపోయారని తెలిపారు. పెరిగిన ధరలు, కరెంటు, ఆర్టీసీ బస్సుల చార్జీలతో పేదల బతుకు భారంగా మారిందన్నారు. టీడీపీ హయాంలో అందరికీ ఉచితంగా దొరికే ఇసుక ఇప్పుడు బియ్యం కంటే ఎక్కువ ధరకు అమ్ముతున్నారని పేర్కొన్నారు. నాసిరకం మద్యం తాగి 35 లక్షల మందికిపైగా ఆస్పత్రి పాలయ్యారని, 30వేలమంది మరణించారని తెలిపారు. వైసీపీని చాలా మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు వీడిపోతున్నారని, రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఊకా విజయకుమార్, దంపూరి భాస్కర్ యాదవ్, యశ్వంత్‌రెడ్డి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు భరోసా

అధికారంలోకి తీసుకొచ్చి పదవులు అడుగుదాం

ఘనంగా బీసీల ఆత్మీయ సమ్మేళనం



ఐక్యత చాటుతున్న బీసీ సంఘాల నేతలు

తిరుపతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బీసీలను అన్ని విధాలుగా ఆదుకుందని, జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత వారి భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లిపోయిందని పలు బీసీ సంఘాల నాయకులు ఆవేదన చెందారు. తెలుగుదేశం పార్టీకి చెందిన బీసీ నాయకుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఓ హోటల్లో జరిగింది. దంపూరి భాస్కర్ యాదవ్, మహేష్ యాదవ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ నుంచి నేటి చంద్రబాబు వరకు బీసీలకు పెద్దపీట వేసింది టీడీపీనేనని స్పష్టం చేశారు. టీటీడీ చైర్మన్, తుడా చైర్మన్ వంటి ప్రతిష్ఠాత్మకమైన పదవులను కూడా తెలుగుదేశం పార్టీ బీసీలకు కట్టబెట్టిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఇలాంటి పదవులు ఎవరికి ఇచ్చారో బీసీలు గుర్తించాలన్నారు. బీసీలకు పూర్వవైభవం రావాలంటే అందరూ టీడీపీకి మద్దతుగా నిలవాలని కోరారు. కృష్ణయాదవ్, జగన్నాథం మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ కులాల దామాషా ప్రకారం నామినేటెడ్ పదవులు కేటాయించేలా అందరం ప్రయత్నం చేయాలని, తిరుపతి ఎమ్మెల్యే సీటు కూడా భవిష్యత్తులో బీసీలకు కేటాయించేలా కష్టపడాలని పిలుపునిచ్చారు. బీసీ నాయకులు విజయలక్ష్మి, ఆనంద్ యాదవ్, కరాటే చంద్ర, సుబ్బు యాదవ్, రాజయ్య, మనోహరాచారి, గంధంబాబు, జ్యోతికుమార్, తులసీదాస్, బాలయ్య, వెంకటేష్, శ్రీరాములు, మధుసూదన్ యాదవ్, జ్ఞానశేఖర్, గోవిందాచారి, శ్రీధర్, శంకర్ యాదవ్, రజనీ, యశోదమ్మ, నాని, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత మృతిపై నిరసన

● వరకట్న వేధింపుల కింద కేసు నమోదు

● హత్య కేసుగా నమోదు చేయాలని ఈస్ట్ పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయింపు



స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన ప్రదర్శన చేస్తున్న మృతురాలి బంధువులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 27: వివాహిత ఆత్మహత్యకు సంబంధించి హత్య కేసు నమోదు చేయాలని మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు ఈస్ట్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆదివారం నిరసనకు దిగారు. స్టేషన్ ఎదుట బైఠాయించారు. సీఐ మహేశ్వర్‌రెడ్డి వారితో చర్చించి, నచ్చజెప్పి వరకట్న వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్టు కేసు నమోదు చేశారు. అశోక్‌నగర్‌కు చెందిన చంద్రశేఖర్, మలర్మతి కుమారుడు ధనరాజ్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. కర్ణాటక రాష్ట్రం, కొప్పల్ జిల్లా గంగావతికి చెందిన రామన్ కుమార్తె జ్యోతిక (23)ను ఒకటిన్నర సంవత్సరం క్రితం పెళ్లి చేసుకున్నాడు. అశోక్‌నగర్‌లోనే నివాసముంటున్నారు. శనివారం రాత్రి భర్తతో జరిగిన చిన్నపాటి గొడవ కారణంగా ఇంట్లోని ఓ గదిలోకి వెళ్లి తలుపు గొళ్లెం పెట్టుకుంది. ఎంతకీ తలుపు తీయకపోవడంతో భర్త ధనరాజ్ కుటుంబ సభ్యులతో కలిసి గడ్డపారతో తలుపులు పగులగొట్టి చూడగా జ్యోతిక ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. ఆమెను కిందికి దించి సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు రుయాకు తీసుకెళ్లగా వైద్యులు పరిశీలించి అప్పటికే ఆమె మృతిచెందినట్టు ధ్రువీకరించారు. పోలీసులు ఆమె భర్తను విచారించగా బీటెక్ చదివిన జ్యోతిక ఉద్యోగం చేస్తానని అడగడంతో నిరాకరించానని, దీంతో ఆత్మహత్యకు పాల్పడిందని వివరించారు. మృతురాలి తల్లిదండ్రులకు సమాచారం అందజేసిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. శనివారం రాత్రి తిరుపతికి చేరుకున్న జ్యోతిక తల్లిదండ్రులు, బంధువులు ఆమె ఇంటికెళ్లి వివరాలు తెలుసుకుని వేకువజామున ఈస్ట్ పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. వరకట్నం కోసం వేధించడమే కాకుండా తమ కుమార్తెను హత్య చేశారంటూ భర్త, కుటుంబ సభ్యులపై హత్యకేసు నమోదు చేయాలని కోరారు. ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ పురుషోత్తంరెడ్డి వారితో చర్చించారు. వివాహ సమయంలో ధనరాజ్‌కు 10 తులాల బంగారు కట్నకానుకల కింద అందజేశామని, ఉద్యోగం లేకపోవడంతో పెళ్లైన ఆరు నెలల తర్వాత వ్యాపారం నిమిత్తం నాలుగు లక్షల రూపాయలు ఇవ్వాలని అడగడంతో ఇచ్చామని జ్యోతిక తండ్రి రామన్ ఫిర్యాదులో పేర్కొన్నారు. మళ్లీ మరో ఐదు లక్షల రూపాయలు తీసుకురావాలని కొన్నాళ్లుగా తమ కుమార్తెను ధనరాజ్, ఆయన కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని, ఆ వేధింపులు తాళలేకే ఆత్మహత్య చేసుకుందని ఫిర్యాదు చేశారు. ఆ మేరకు భర్త ధనరాజ్, ఆయన తల్లిదండ్రులు, సోదరిపై 304బి. 398ఎ వరకట్న వేధింపుల కింద కేసు నమోదు చేశారు.

చిత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్తంభించిన రిజిస్ట్రేషన్లు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 28: చిత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నాలుగు రోజులుగా భూములు, ఇంటి స్థలాల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. సాంకేతిక లోపంతో ఆన్‌లైన్ పనిచేయకపోవడంతో కక్షిదారులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. విక్రయించిన భూములకు డబ్బులు రాక, ఎప్పుడు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందో తెలియక పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించి వర్షన్ అప్‌డేట్‌కు అమరావతిలోని రిజిస్ట్రేషన్ శాఖ చర్యలు చేపడుతుండటంతో రోజులో కొన్ని గంటల పాటు సర్వర్ డౌన్ అవుతోందని అధికారులు చెబుతున్నారు. దీనివల్ల రూ.లక్షల్లో క్రయవిక్రయాలు నిలిచిపోతున్నాయని అంటున్నారు. సోమవారం నాటికైనా సమస్యను పరిష్కరించాలని కక్షిదారులు కోరుతున్నారు.

సాహిత్యం సమాజ జీవనాడి

ఆచార్య భూమన సుగుణ



కవులు, కళాకారులను సన్మానిస్తున్న కళా వేదిక నిర్వాహకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 28: సాహిత్యం సమాజపు జీవనాడి అని ఆచార్య భూమన సుగుణ పేర్కొన్నారు. శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో ఎస్వీయూ సెనేట్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జానపదం అనేది విజ్ఞాన గని అని, కవిత్వం మనిషి ఆలోచనలను వ్యక్తం చేసేందుకు మార్గమని చెప్పారు. కళలు మనిషిని, సమాజాన్ని ప్రభావితం చేస్తే శక్తులని తెలిపారు. కనుమరుగవుతున్న కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పలువురు కవులు, కళాకారులు జానపద ప్రదర్శనలు, కవితా పఠనం నిర్వహించారు. వీరిని కళా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి అరవ జయపాల్, తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు సాకం నాగరాజ, రచయిత రాసాని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కవులు కవులు సంగిశెట్టి శ్రీనివాస్, యువశ్రీ మురళి, ఆకుల మల్లేశ్వరరావు, జానపద కళాకారుడు రెడ్డెప్ప, నారాయణ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి పురందరదాసు ఆరాధనా మహోత్సవాలు

తిరుమల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక సంగీత పితామహుడు పురందరదాసు ఆరాధనా మహోత్సవాలు టీటీడీ దాససాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 8 నుంచి 10వ తేదీ వరకు తిరుమల ఆస్థానమండపంలో నిర్వహించనున్నారు. తొలిరోజు ఉదయం సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన, నగర సంకీర్తన, పురందర సాహిత్య గోష్ఠి, పీఠాధిపతుల మంగళాశాసనాలు, మధ్యాహ్నం సంకీర్తన కార్యక్రమాలు ఉంటాయి. రెండో రోజు ఉదయం 6 గంటలకు అలిపిరి వద్ద పురందరదాసు విగ్రహానికి పుష్పమాల సమర్పిస్తారు. సాయంత్రం 6 గంటలకు శ్రీవారి ఆలయం నుంచి నారాయణగిరి ఉద్యానవనం వరకు శ్రీవారి ఉత్సవమూర్తుల ఊరేగింపు, ఊంజల్‌సేవ, దాస సంకీర్తన కార్యక్రమాలు నిర్వహిస్తారు. చివరి రోజు ఉదయం సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన, నగర సంకీర్తన, హరిదాస రసరంజని కార్యక్రమాలు ఉంటాయి.

7న 'శ్రీవేంకటేశ్వర నవరత్న మాలిక'

తిరుమల కల్యాణవేదికలో యువ కళాకారులతో ఫిబ్రవరి 7వ తేదీన శ్రీవేంకటేశ్వర నవరత్న మాలిక గోష్ఠిగానం నిర్వహించనున్నారు. అలాగే సంగీత, నృత్య, వాద్య రంగాలలో నిష్ణాతులైన యువ కళాకారులకు ఈ ఏడాది మొదటిసారిగా టీటీడీ దాససాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో 'యువ ప్రతిభ పురస్కారాలు' అందజేస్తారు. ఏర్పాట్లను టీటీడీ దాససాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు పర్యవేక్షిస్తున్నారు.

కెమిస్టు అండ్ డ్రగ్గిస్టు నూతన కార్యవర్గం



నూతన నేతలను సన్మానిస్తున్న సభ్యులు

తిరుపతి సిటీ, జనవరి 28 : తిరుపతి జిల్లా కెమిస్టు అండ్ డ్రగ్గిస్టు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో ఆదివారం తిరుపతి జిల్లా కెమిస్టు అండ్ డ్రగ్గిస్టు అసోసియేషన్ సభ్యులు సమావేశమై అధ్యక్షుడిగా పీవీ రత్నం, కార్యదర్శిగా సుబ్బరామగుప్తా, ట్రెజరర్‌గా నరసింహారెడ్డిని ఎన్నుకున్నారు. కెమిస్టు అండ్ డ్రగ్గిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన కెమిస్టులు రత్నం, నరేష్, నరసింహులు, కేపీ రంగారావు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

బీవీపాళెంలో రిసార్ట్స్ ప్రారంభం



రిసార్ట్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రోజా

తడ, జనవరి 28: తడ మండలంలోని భీములవారిపాళెం వద్ద నిర్మించిన రిసార్ట్స్‌ను మంత్రి రోజా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో రాష్ట్రంలో ఇప్పటికే 40 చోట్ల టూరిజం రిసార్ట్స్ నిర్మించామని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నో సుందరమైన ప్రదేశాలు, దేవాలయాలు ఉన్నాయని, వాటి ద్వారా పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా రిసార్ట్స్ ప్రారంభిస్తున్నామని చెప్పారు. అనంతరం మంత్రి రోజాను రిసార్ట్స్ లీజుదారు రూఫ్‌వెస్ట్ సంస్థ ఎండీ శ్రీధరణ్‌నారాయణన్ సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ సీఈవో శ్యామ్‌జార్జి, తడ, సూళ్లూరుపేట ఎంపీపీలు కొలవి రఘురెడ్డి, అల్లూరు అనిల్‌రెడ్డి, వైసీపీ నాయకులు పర్వత రెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, రత్నం, సుందరరెడ్డి, నత్తం శ్రీనివాసులు, పర్యాటకశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే డుమ్మా

రిసార్ట్స్ ప్రారంభోత్సవానికి సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య హాజరుకాలేదు. మంత్రి రోజా ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయానికే రిసార్ట్స్ వద్దకు చేరుకున్నారు. ఐదు నిమిషాలపాటు అక్కడున్న మంత్రి వెంటనే వెనుతిరిగి వెళ్లిపోయారు. సాయంత్రం 4.30గంటలకు వచ్చి రిసార్ట్స్‌ను ప్రారంభించారు. దీనిపై అధికారులు మాట్లాడుతూ షెడ్యూలు ప్రకారం మంత్రి మూడు గంటలకు రావాల్సి ఉందని, ముందుగానే వచ్చిన ఆమె విశ్రాంతి తీసుకోవడానికి వెళ్లారని చెప్పారు. అయితే ఎమ్మెల్యే రావడంలేదని తెలిసి మంత్రి వెళ్లిపోయారని అధికార పార్టీ కొందరు నేతలు గుసగుసలాడుకోవడం కన్పించింది.

వివాహిత మృతిపై నిరసన

- హత్య కేసుగా నమోదు చేయాలని ఈస్ట్ పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయింపు
- వరకట్న వేధింపుల కింద కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 27: వివాహిత ఆత్మహత్యకు సంబంధించి హత్య కేసు నమోదు చేయాలని మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు ఈస్ట్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆదివారం నిరసనకు దిగారు. స్టేషన్ ఎదుట బైఠాయించారు. సీఐ మహేశ్వర్‌రెడ్డి వారితో చర్చించి, నచ్చజెప్పి వరకట్న వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్టు కేసు నమోదు చేశారు. అశోక్‌నగర్‌కు చెందిన చంద్రశేఖర్, మలర్మతి కుమారుడు ధనరాజ్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. కర్ణాటక రాష్ట్రం, కొప్పల్ జిల్లా గంగావతికి చెందిన రామన్ కుమార్తె జ్యోతిక (23)ను ఒకటిన్నర సంవత్సరం క్రితం పెళ్లి చేసుకున్నాడు. అశోక్‌నగర్‌లోనే నివాసముంటున్నారు. శనివారం రాత్రి భర్తతో జరిగిన చిన్నపాటి గొడవ కారణంగా ఇంట్లోని ఓ గదిలోకి వెళ్లి తలుపు గొళ్లెం పెట్టుకుంది. ఎంతకీ తలుపు తీయకపోవడంతో భర్త ధనరాజ్ కుటుంబ సభ్యులతో కలిసి గడ్డపారతో తలుపులు పగులగొట్టి చూడగా జ్యోతిక ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. ఆమెను కిందికి దించి సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు రుయాకు తీసుకెళ్లగా వైద్యులు పరిశీలించి అప్పటికే ఆమె మృతిచెందినట్టు ధ్రువీకరించారు. పోలీసులు ఆమె భర్తను విచారించగా బీటెక్ చదివిన జ్యోతిక ఉద్యోగం చేస్తానని అడగడంతో నిరాకరించానని, దీంతో ఆత్మహత్యకు పాల్పడిందని వివరించారు. మృతురాలి తల్లిదండ్రులకు సమాచారం అందజేసిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. శనివారం రాత్రి తిరుపతికి చేరుకున్న జ్యోతిక తల్లిదండ్రులు, బంధువులు ఆమె ఇంటికెళ్లి వివరాలు తెలుసుకుని వేకువజామున ఈస్ట్ పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. వరకట్నం కోసం వేధించడమే కాకుండా తమ కుమార్తెను హత్య చేశారంటూ భర్త, కుటుంబ సభ్యులపై హత్యకేసు నమోదు చేయాలని కోరారు. ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ పురుషోత్తంరెడ్డి వారితో చర్చించారు. వివాహ సమయంలో ధనరాజ్‌కు 10 తులాల బంగారు కట్నకానుకల కింద అందజేశామని, ఉద్యోగం లేకపోవడంతో పెళ్లైన ఆరు నెలల తర్వాత వ్యాపారం నిమిత్తం నాలుగు లక్షల రూపాయలు ఇవ్వాలని అడగడంతో ఇచ్చామని జ్యోతిక తండ్రి రామన్ ఫిర్యాదులో పేర్కొన్నారు. మళ్లీ మరో ఐదు లక్షల రూపాయలు తీసుకురావాలని కొన్నాళ్లుగా తమ కుమార్తెను ధనరాజ్, ఆయన కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని, ఆ వేధింపులు తాళలేకే ఆత్మహత్య చేసుకుందని ఫిర్యాదు చేశారు. ఆ మేరకు భర్త ధనరాజ్, ఆయన తల్లిదండ్రులు, సోదరిపై 304బి. 398ఎ వరకట్న వేధింపుల కింద కేసు నమోదు చేశారు.

8 నుంచి పురందరదాసు ఆరాధనా మహోత్సవాలు

తిరుమల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక సంగీత పితామహుడు పురందరదాసు ఆరాధనా మహోత్సవాలు టీటీడీ దాససాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 8 నుంచి 10వ తేదీ వరకు తిరుమల ఆస్థానమండపంలో నిర్వహించనున్నారు. తొలిరోజు ఉదయం సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన, నగర సంకీర్తన, పురందర సాహిత్య గోష్ఠి, పీఠాధిపతుల మంగళాశాసనాలు, మధ్యాహ్నం సంకీర్తన కార్యక్రమాలు ఉంటాయి. రెండో రోజు ఉదయం 6 గంటలకు అలిపిరి వద్ద పురందరదాసు విగ్రహానికి పుష్పమాల సమర్పిస్తారు. సాయంత్రం 6 గంటలకు శ్రీవారి ఆలయం నుంచి నారాయణగిరి ఉద్యానవనం వరకు శ్రీవారి ఉత్సవమూర్తుల ఊరేగింపు, ఊంజల్‌సేవ, దాససంకీర్తన కార్యక్రమాలు నిర్వహిస్తారు. చివరి రోజు ఉదయం సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన, నగర సంకీర్తన, హరిదాస రసరంజని కార్యక్రమాలు ఉంటాయి.

7న 'శ్రీవేంకటేశ్వర నవరత్న మాలిక'

తిరుమల కల్యాణవేదికలో యువ కళాకారులతో ఫిబ్రవరి 7వ తేదీన శ్రీవేంకటేశ్వర నవరత్న మాలిక గోష్ఠిగానం నిర్వహించనున్నారు. అలాగే సంగీత, నృత్య, వాద్య రంగాలలో నిష్ణాతులైన యువ కళాకారులకు ఈ ఏడాది మొదటిసారిగా టీటీడీ దాససాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో 'యువ ప్రతిభ పురస్కారాలు' అందజేస్తారు. ఏర్పాట్లను టీటీడీ దాససాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు పర్యవేక్షిస్తున్నారు.

శారదపీఠం భవన నిర్మాణాలు నిలిపేయాలి


కరపత్రం చూపుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 28: తిరుమలలో విశాఖ శారదాపీఠం చేపట్టిన సెవెన్‌స్టార్ బిల్డింగ్ అక్రమ నిర్మాణం నిలిపివేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు నీరుగట్టు నగేష్ డిమాండ్ చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ టీటీడీ నిబంధనలకు విరుద్ధంగా తిరుమలలో కట్టడాలు చేపట్టడం బాధాకరమన్నారు. హైకోర్టు అడ్వకేట్ కమిషనర్‌ను పంపడం తిరుమల చరిత్రలో ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. సనతాన ధర్మాలను, హిందూ సంప్రదాయాలను కాపాడుతూ భగవంతుడి దర్శనానికి వచ్చే భక్తులకు సేవలందించాల్సిన కొన్ని పీఠాలు టీటీడీ నిబంధనలు పాటించకుండా రాజకీయ పలుకుబడితో ఇష్టానుసారంగా వ్యవహరించడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందన్నారు. టీటీడీ వ్యవస్థను ఉద్యోగులు తప్పుదారి పట్టిస్తున్నారని, తక్షణమే ఈ అక్రమ భవనాలను తొలగించాలని, లేకపోతే భక్తులతో కలిసి నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు బొంతల రాజేష్ రాయల్, వెంకటా చలపతి, కోడివాక చందు, కందనూరు జగదీష్ పాల్గొన్నారు.

నేడు టిడ్కో గృహాల ప్రారంభం

వెంకటగిరి టౌన్, జనవరి 28: పట్టణంలోని జగనన్న లేఅవుట్ వద్ద ఉన్న టిడ్కో గృహాలను సోమవారం ప్రారంభించనున్నట్లు టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక టిడ్కో గృహ సముదాయంలో మౌళిక వసతులు పరిశీలించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 35 ప్రాంతాల్లో టిడ్కో ఇళ్లు ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశామని చెప్పారు. వెంకటగిరిలో నిర్మించిన టిడ్కో ఇళ్లను సోమవారం లబ్ధిదారులకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి తాళాలు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టిడ్కో చీఫ్ ఇంజనీర్ జాన్ సైమన్ రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శాస్త్రి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పార్థసారధి, కమిషనర్ వెంకటరమణ పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలు: టీడీపీ

చిల్లకూరు, జనవరి 28: రాష్ట్రంలో అరాచకపాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని టీడీపీ నాయకులు అన్నారు. ఆదివారం గూడూరు టీడీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో అరాచకాలు పెరిగిపోయాయన్నారు. నాలుగున్నరేళ్లలో ఒక్క అభివృద్ధి పని కూడా చేపట్టలేదని, పైగా విద్యుత్, ఆర్టీసీ చార్జీలు, పన్నులు భారీగా పెంచారని, ఇక నిత్యావసర ధరలు పెరిగిపోవడంతో పేదలు ఆర్థికంగా అవస్థలు పడుతున్నారన్నారు. వైసీపీని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ నేతలు చెప్పారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, చంద్రమౌళి, రావుల శివప్రసాద్‌గౌడ్, షాహుల్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పేలవంగా 'వైసీపీ సాధికార సభ'


జనాలు వెళ్లిపోవడంతో పలచబడ్డ సభా ప్రాంగణం, ప్రసంగిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి(ఇన్‌సెట్లో)

కోట, జనవరి 28: కోట పట్టణంలో ఆదివారం రాత్రి జరిగిన వైసీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర సభ పేలవంగా ముగిసింది. గూడూరు నియోజకవర్గ స్థాయిలో సభను ఇక్కడ పెట్టి ఐదు మండలాల నుంచి జనాలను తరలించారు. అయితే నాయకులు ప్రసంగాలు మొదలుపెట్టేలోపే సభా ప్రాంగణం నుంచి వచ్చిన జనం వచ్చినట్లుగా మెల్లమెల్లగా వెళ్లిపోయారు. మిగిలినవారికే వైసీపీ నాయకులు ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చి ముగించారు. రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు బీమస్తాన్‌రావు, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మేరిగ మురళి, బల్లి కల్యాణ్, నాయకులు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, కొడవలూరు ధనంజయరెడ్డి, నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనానికి ఇక్కట్లు

సభ ఏర్పాటు చేసిన కోట బజారు సెంటరు ఇరుకు ప్రాంతం. ఇక్కడ ఇరువైపులా అంగళ్లకు ఓవైపు వైసీపీ నాయకులు ఫ్లెక్సీలు, కటౌట్లు కట్టేయగా, మరోవైపు పోలీసులు బ్యారికేడ్లు పెట్టడంతో దుకాణాలనూ మూతవేయాల్సి వచ్చిందని వ్యాపారులు వాపోయారు. ఇక మధ్యాహ్నం 11 గంటల నుంచే బస్టాండులోకీ బస్సులనూ రానీయలేదు. దీనివల్ల జనానికి ఇక్కట్లు తప్పలేదు.


బోసిపోయిన ఆర్టీసీ బస్టాండు

ఉమ్మడి చిత్తూరులో ఏడు ఉత్తమ హరిత పాఠశాలల ఎంపిక

స్టేట్ కో-ఆర్డినేటర్ నీలకంఠయ్యకు జాతీయ అవార్డు

తిరుపతి(విద్య), జనవరి 28: ఏపీ నేషనల్ గ్రీన్ కోర్, సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్(ఢిల్లీ) ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రీన్‌స్కూల్ ప్రోగ్రామ్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఉత్తమ హరిత పాఠశాలలుగా 7 హైస్కూల్స్ ఎంపికయ్యాయి. రాష్ట్రంలో 3,450స్కూల్స్ నమోదు చేసుకుని, ఇప్పటివరకు 900కిపైగా గ్రీన్ ఆడిటింగ్‌ను సమర్పించినట్లు గ్రీన్ స్కూల్ ప్రోగ్రామ్ రాష్ట్ర కోఆర్డినేటర్ పి.నీలకంఠయ్య పేర్కొన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో ఉత్తమ హరిత విభాగంలో 12 స్కూల్స్ ఎంపికవగా.. అందులో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏడు ఉన్నట్లు వివరించారు. కాగా ల్యాండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో వాల్మీకిపురం మండలంలోని గండబోయినపల్లె జెడ్పీహెచ్ఎస్ అవార్డుకు ఎంపికైంది. ఈ ప్రోగ్రామ్‌ని క్షేత్రస్థాయిలో ముందుకు తీసుకెళ్తున్న స్టేట్ కోఆర్డినేటర్, కరకంబాడి జెడ్పీహెచ్ఎస్ బయాలజీ టీచర్ పి.నీలకంఠయ్యను జాతీయ స్థాయిలో ఉత్తమ కోఆర్డినేటర్‌గా ఎంపిక చేశారు. ఈనెల 30న న్యూఢిల్లీలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డు, ధ్రువపత్రాలను అందిస్తారు. నీలకంఠయ్యను గ్రీన్‌స్కూల్ ప్రోగ్రామ్ స్టేట్ డైరెక్టర్ పి.స్రవంతి, జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ శేఖర్ అభినందించారు.


నీలకంఠయ్య

- ఉత్తమ హరిత విభాగంలో ఎంపికైన పాఠశాలలు: జెడ్పీహెచ్(గండబోయినపల్లె, వాల్మీకిపురం మండలం), జెడ్పీహెచ్ఎస్(మద్రిపాడు, గుర్రంకొండ మండలం), జెడ్పీహెచ్ఎస్(తవణంపల్లె), జెడ్పీహెచ్ఎస్(ఆర్కేఎంపురం, వెదురుకుప్పం మండలం), జెడ్పీహెచ్ఎస్(కల్లూరు), జెడ్పీజీహెచ్ఎస్(నారాయణవనం), జెడ్పీహెచ్ఎస్(పాలమంగళం).

జగన్‌కు మిగిలింది 74 రోజులు మాత్రమే : టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహయాదవ్

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 28: సీఎం జగన్‌కు మిగిలింది 74 రోజులు మాత్రమేనని, వైసీపీని ఓడించేందుకు జనం సిద్ధంగా ఉన్నారని టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజవకర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ విమర్శించారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ జగన్ ఎన్నికలకు సిద్ధమవుతుంటే ప్రజలు ఆయనకు స్వస్తి పలికేందుకు తయారవుతున్నారని తెలిపారు. వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, వెనుకబడిన కులాలు, మైనార్టీలు నలిగిపోయారని తెలిపారు. పెరిగిన ధరలు, కరెంటు, ఆర్టీసీ బస్సుల చార్జీలతో పేదల బతుకు భారంగా మారిందన్నారు. టీడీపీ హయాంలో అందరికీ ఉచితంగా దొరికే ఇసుక ఇప్పుడు బియ్యం కంటే ఎక్కువ ధరకు అమ్ముతున్నారని పేర్కొన్నారు. నాసిరకం మద్యం తాగి 35 లక్షల మందికిపైగా ఆస్పత్రి పాలయ్యారని, 30వేలమంది మరణించారని తెలిపారు. వైసీపీని చాలా మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు వీడిపోతున్నారని, రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఊకా విజయకుమార్, దంపూరి భాస్కర్‌యాదవ్, యశ్వంత్‌రెడ్డి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ పాలకమండలిని భగవంతుడు క్షమించడు: సీపీఐ

తిరుపతి (కొర్లగుంట), జనవరి 28: టీటీడీ యాజమాన్యాన్ని, పాలకమండలిని భగవంతుడు కూడా క్షమించడని సీపీఐ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. టీటీడీ అటవీ కార్మికుల రెండో రోజు నిరవధిక దీక్షలో ఉన్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళిని, కార్మికులను ఆయన పరామర్శించి, రెడ్ సెల్యూట్ చేశారు. 1,159 రోజులుగా టీటీడీ అటవీ కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేస్తుంటే టీటీడీ యాజమాన్యం ఏం చేస్తోందని ప్రశ్నించారు. కరుణాకరరెడ్డి లాంటి వ్యక్తి టీటీడీ ఛైర్మన్‌గా ఉన్నా ఆమరణ నిరాహారదీక్షలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందంటే పరిస్థితి ఏపాటిదో అర్థమవుతోందన్నారు. తక్షణం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అటవీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి పోరాటం, అధికార పార్టీ అవకాశవాదం తదితర అంశాలతో సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు పాడిన ఉయ్యాల-ఉయ్యాల పాట ఆకట్టుకుంది. అంగన్వాడీ యూనియన్ నేత నాగరాజమ్మ ఆధ్వర్యంలో మహిళలు కోలాటం, గొబ్బెమ్మ పాటలను ప్రదర్శించారు.

కార్మికుల సంక్షేమం... చంద్రన్నతోనే సాకారం


సమావేశంలో మాట్లాడుతున్న రఘురామరాజు

పుత్తూరు అర్బన్, జనవరి 28: కార్మికుల సంక్షేమం చంద్రబాబునాయుడుతోనే సాకారమవుతుందని టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రావిళ్ల మాధవనాయుడు స్పష్టం చేశారు. ఆదివారం టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో టెక్కలి నుంచి బయలుదేరిన చంద్రన్న కార్మిక చైతన్య బస్సుయాత్ర పుత్తూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆటో రంగ కార్మికులు, సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కుల రఘురామరాజు మాట్లాడుతూ సీఎం జగన్ చేతగాని పాలన కారణంగా రాష్ట్రంలో కార్మికులు రోడ్డుపడ్డారని దుయ్యబట్టారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్‌కు మద్దతుగా ఓట్లేసి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, నాయకులు అన్నునాగేంద్ర, రాజేంద్ర, హమీద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధం


సమావేశంలో మాట్లాడుతున్న భానుప్రకాష్

వడమాలపేట, జనవరి 28: వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. వడమాలపేటలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలో మంత్రి రోజా చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలని ప్రశ్నించారు. నియోజకవర్గంలో మండలాలను అన్నదమ్ములకు పంచి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలు అమలు చేయకపోగా, కనీసం చేనేత కార్మికులకు కూడా న్యాయం చేయలేదని విమర్శించారు. గాలేరు - నగరి నీళ్లు తీసుకుని రాలేదని, అయితే అన్నదమ్ములు ఊళ్లు పంచుకుని కనపడిన గుట్టలన్నీ ఆక్రమించుకుని పట్టాలు చేసుకుంటున్నారని విమర్శించారు. రాబోయే ఎన్నికలు వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సమావేశంలో జానా వెంకటయ్య, హేమావతి, ధనంజయులు నాయుడు, లక్ష్మీప్రసన్న, దేవ, శేషాద్రి యాదవ్, వివేకానంద, సురేష్‌రాజు, మణిరాజు, దాముయాదవ్, ఉమాపతి, వెంకటేశ్వరావ్, ధనలక్ష్మి, దుర్వాసులు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు శ్రీవారి భక్తుల దుర్మరణం


వరదన్ మృతదేహం

నారాయణవనం, జనవరి 28: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు శ్రీవారి భక్తులు దుర్మరణం చెందిన ఘటన నారాయణవనం మండలం రాళ్ల కాలవ వద్ద ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్ఐ పరమేష్ నాయక్ కథనం మేరకు.... తమిళనాడుకు చెందిన మోహన్, వరదన్ శ్రీవారి దర్శనం కోసం కాలినడకను తిరుమలకు బయలుదేరారు. ఆదివారం ఉదయం నారాయణవనం మండలం రాళ్ల కాలవ వద్ద వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మోహన్ అక్కడికక్కడే మృతి చెందగా, వరదన్ తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని స్థానికులు పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చంద్రన్నతోనే భవిష్యత్తు గ్యారెంటీ


ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

నారాయణవనం, జనవరి 28: చంద్రన్నతోనే భవిష్యత్తు గ్యారెంటీ అని టీడీపీ మండల క్లస్టర్ షణ్ముగం, తిరుపతి పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోపి అన్నారు. మండల పరిధిలోని తుంబూరు హరిజనవాడ, నైనారు కండ్రిగలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి కుమార్, సెక్రటరీ మునివేలు, నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.92 కోట్లు

తిరుమల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.92 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది.

నగరి నియోజకవర్గమే నాకు కుటుంబం: భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జనవరి 28: నగరి నియోజకవర్గమే తనకు కుటుంబమని టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ పునరుద్ఘాటించారు. ఆదివారం పుత్తూరు పట్టణ పరిధిలోని 24, 25, 26 వార్డుల్లో మున్సిపల్ మాజీ ఛైర్మన్, యూనిట్ ఇన్‌చార్జి యుగంధర్ ఆధ్వర్యంలో మీతో మీ తెలుగుదేశం, బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని జనసేన నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు సాయం కోసం వచ్చిన ప్రతి ఒక్కరినీ ఆదుకున్న విషయాన్ని గుర్తుచేశారు. పుత్తూరు అభివృద్ధిలో ముద్దుకృష్ణమది చెరగని ముద్రని స్పష్టం చేశారు. ఆయన ఆశయాల కొనసాగించాలనే తాను సేవ చేసేందుకు విదేశాల్లో ఉన్నతమైన జీవితాన్ని సైతం వదులుకుని ప్రజల ముందుకు వచ్చానని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రజలే తనకు కుటుంబసభ్యులని, ముద్దుకృష్ణమను అభిమానించే ప్రతి ఒక్కరూ తనకు బంధువులని స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రజలు రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపిస్తే చెప్పుకోదగ్గ అభివృద్ధి పనులు ఏమి చేశారో మంత్రి రోజా చెప్పాలని నిలదీశారు. ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో నియోజకవర్గంలో బాగుపడింది మంత్రి రోజా కుటుంబం ఒక్కటేనని విమర్శించారు. నాలుగున్నరేళ్లలో చేసిందేమీ లేకపోవడంతో ఇప్పుడు భూమి పూజలు చేస్తూ ఫోటోలకు ఫోజులు ఇస్తున్నారని మండిపడ్డారు. కేవలం ప్రజలను మరోసారి మోసం చేయడానికే వీధికో భూమిపూజ, వార్డుకో శిలాఫలకం కార్యక్రమాన్ని భుజాలకెత్తుకున్నారని దుయ్యబట్టారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా మరోసారి మోసపోవడానికి నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా లేరని ఆయన తేల్చి చెప్పారు. ఈ దఫా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇవ్వనున్నారని నగరి గడ్డపై ఎగిరేది టీడీపీ జెండానేనని తెలిపారు.


కాపువీధిలో ప్రచారం నిర్వహిస్తున్న గాలి భానుప్రకాష్

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

గ్రామదేవత ఆరేటమ్మ ఆలయ మాజీ ఛైర్మన్ బండి దొరస్వామిరెడ్డి, పంచాయతీ బోర్డు మాజీ సభ్యుడు జయచంద్రారెడ్డి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి గాలి భానుప్రకాష్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బండి దొరస్వామిరెడ్డి మాట్లాడుతూ ముద్దుకృష్ణమ నాయుడు నాయకత్వంలో గతంలో పని చేసిన సందర్భాలను గుర్తు చేసుకున్నారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరినీ పార్టీలకు అతీతంగా ఆదుకున్న నాయకుడు ముద్దుకృష్ణమని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

ఓటరు జాబితాపై అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న గంజి మాధవయ్య

పుత్తూరు అర్బన్, జనవరి 28: ఓటర్ల తుది జాబితా విడుదలైన నేపథ్యంలో పోలింగ్ బూత్ స్థాయి నాయకులు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య అన్నారు. ఆదివారం పట్టణంలో పుత్తూరు రూరల్ పరిధిలోని 23 బూత్‌లకు సంబంధించి బీఎల్ఏలు, గ్రామకమిటీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఓటరు జాబితాలో సవరణలు, మార్పులు, చేర్పులు, అభ్యంతరాలపై పార్టీ తరఫున ఇచ్చిన ఫిర్యాదులపై అధికారులు తీసుకున్న చర్యలను గమనించాలని కోరారు. పరిష్కారం కానీ క్లైయింలపై నివేదిక రూపొందించుకుని నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ ఆధ్వర్యంలో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని తీర్మానించారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి బాలాజీ, తడుకు సర్పంచ్ బొబ్బిలియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుదర్శన్



పుత్తూరు, జనవరి 28: వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుదర్శన్ నియమితులయ్యారు. గతంలో ఆయన పుత్తూరు మండలం వేపగుంట సర్పంచుగా పనిచేశారు. తన నియామకానికి సహకరించిన మంత్రి రోజా, స్థానిక వైసీపీ నాయకులకు సుదర్శన్ కృతజ్ఞతలు తెలిపారు.

జనసేనలో చేరిన వ్యాపారవేత్త సుధాకర్ రాజు



పుత్తూరు టౌన్, జనవరి 28: నగరి నియోజకవర్గానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త సుధాకర్ రాజు జనసేన పార్టీలో చేరారు. నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి మెరుపుల మహేష్, జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ ఆధ్వర్యంలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు.

కెమిస్టు అండ్ డ్రగ్గిస్టు నూతన కార్యవర్గం

తిరుపతి సిటీ, జనవరి 28: తిరుపతి జిల్లా కెమిస్టు అండ్ డ్రగ్గిస్టు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో ఆదివారం తిరుపతి జిల్లా కెమిస్టు అండ్ డ్రగ్గిస్టు అసోసియేషన్ సభ్యులు సమావేశమై అధ్యక్షుడిగా పీవీ రత్నం, కార్యదర్శిగా సుబ్బరామగుప్తా, ట్రెజరర్‌గా నరసింహారెడ్డిని ఎన్నుకున్నారు. కెమిస్టు అండ్ డ్రగ్గిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ముక్కంటి అన్నదానానికి బియ్యం వితరణ



శ్రీకాళహస్తి, జనవరి 28: ముక్కంటి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానానికి శ్రీకాళహస్తికి చెందిన కిరణ్, స్వర్ణలత దంపతులు 50 బియ్యం బస్తాలను వితరణ చేశారు. ఆదివారం ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులకు బియ్యం అందించారు. వారి కుమారుడు తన్విష్ జన్మదినం పురస్కరించుకుని బియ్యం సమర్పించినట్లు దాతలు తెలిపారు. ఆలయ అధికారులు దాతలకు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేసి శేష వస్త్రంతో సత్కరించారు.

ఆలయ ఉద్యోగులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేసుకుంటున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి, జనవరి 28: ముక్కంటి ఆలయ ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పట్టణానికి చెందిన ఎంజీఎం వైద్యశాల ఆధ్వర్యంలో ముక్కంటి ఆలయ ఉద్యోగుల కోసం ఆదివారం భరద్వాజ సదన్‌లో ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు వైద్య శిబిరాన్ని ప్రారంభిం చారు. పలు రకాల పరీక్షలను ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, డిప్యూటీ ఈవో వెంకటసుబ్బయ్య, వైద్యులు పాల్గొన్నారు.

అభివృద్ధికి మారుపేరు టీడీపీ

శ్రీకాళహస్తి, జనవరి 28: శ్రీకాళహస్తి మండలంలోని చుక్కల నిడిగల్లు, టీఎంవీ కండ్రిగ, తొండమనాడు గ్రామాల్లో ఆదివారం బొజ్జల రిషితారెడ్డి ఇంటింటా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు, నాయకులు కామేష్‌యాదవ్, రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.
● గోపాల కృష్ణారెడ్డి కాలనీలో మృతిచెందిన పెరుమాళ్ మృతదేహానికి బొజ్జల బృందమ్మ నివాళి అర్పించారు. అనంతరం ఆ కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం చేశారు.

స్నేహబంధం.. సేవతో పదిలం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

శ్రీకాళహస్తి, జనవరి 28: తమ స్నేహబంధం సేవతో పదిలంగా కొనసాగిస్తామని భక్తకన్నప్ప ఎడ్యు కేషనల్ సొసైటీ సభ్యులు అన్నారు. శ్రీకాళహస్తి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1987-88 విద్యా సంవ త్సరం 10వ తరగతి అభ్యసించిన పూర్వ విద్యార్థుల భక్తకన్నప్ప ఎడ్యుకేషనల్ సొసైటీగా ఏర్పడి సేవా కార్య క్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో వారు పట్టణంలోని తెలుగు గంగ అతిథి గృహంలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రూ.లక్ష నగదును ఆపదలోని స్నేహితులను అందించారు. భవిష్యత్తులో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ నాగేశు, సభ్యులు రాజేశ్వరరావు, గిరిబాబు, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి అనుమతి ఇవ్వని రెవెన్యూ



హౌసింగ్ అధికారులు మంజూరు చేసిన గృహ నిర్మాణ పత్రం చూపుతున్న విజయలక్ష్మి

వరదయ్యపాళెం, జనవరి 28: ఇల్లు నిర్మించుకోకుండా రెవెన్యూ అధికారులు, అధికార పార్టీ నాయకులు అడ్డుకుంటున్నారని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఆమె కథనం మేరకు.. చిన్నపాండూరు పంచాయతీ వీకేఆర్‌వై కాలనీకి చెందిన విజయలక్ష్మి అనే గిరిజన మహిళకు 15 సంవత్సరాల క్రితం ప్రభుత్వం ఇంటి స్థలం మంజూరు చేసింది. హౌసింగ్ కింద ఇంటి నిర్మాణానికి అధికారులు అనుమతి ఇచ్చారు. ప్రస్తుతం ఇల్లు నిర్మించుకోవాలని రెవెన్యూ వారి అనుమతి కోరితే అంగీకరించడం లేదు. ఎంతో కొంత ఇస్తే కానీ అనుమతి రాదని బిల్లులు రావని చెబుతున్నారు. దీంతో ఇంటి నిర్మాణం చేపట్టలేకపోతోంది. ఉన్నతాధి కారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతోంది.

ట్రాఫిక్ ఇబ్బందులపై దృష్టి పెట్టండి



ఎస్ఐ ప్రతాప్‌ను సన్మానిస్తున్న దృశ్యం

వరదయ్యపాళెం, జనవరి 28: వరదయ్యపాళెం మండలంలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలని స్థానిక ఎస్ఐ ప్రతాప్‌ను ఆదివారం డైనమిక్ ఫౌండేషన్ ప్రతినిధులు కోరారు. ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన ప్రతాప్‌ను వారు ఘనంగా సన్మానించారు. స్థానిక సమస్యలపై చర్చించారు. పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్ఐ తెలిపారు. అదే విధంగా కలెక్టర్ నుంచి ఉత్తమ కానిస్టేబుల్ పురస్కారం అందుకున్న హరిప్రసాద్‌ను కూడా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డైనమిక్ ప్రతినిధులు తొండమనాటి నాగ ప్రసాద్, బొప్పన శ్రీనివాస్, పంజాం రామసుబ్బయ్య, ప్రభాకర్, గోపి, మహమ్మద్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో హైకోర్టు రిజిస్ట్రార్

శ్రీకాళహస్తి, జనవరి 28: ముక్కంటి ఆలయాన్ని ఆదివారం ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ కమలాకర్ రెడ్డి దర్శించుకున్నారు. శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్‌నాయక్ వారికి దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనా నంతరం గురు దక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు శేష వస్త్రంతో సత్కరించి ఆశీర్వచనం ఇచ్చారు.



ముక్కంటి ఆలయం వద్ద హైకోర్టు రిజిస్ట్రార్ కమలాకర్ రెడ్డి

బీసీలు అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం రావాలి

కేవీబీపురం జనవరి28: బీసీలు అభివృద్ధి చెందాలంటే మళ్లీ తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టాలని ఆ పార్టీ సత్యవేడు ఇన్‌చార్జి హెలెన్ హేమలత తెలియజేశారు. ఆదివారం మండల కేంద్రంలో బీసీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ బీసీలను మోసం చేసిందన్నారు. టీడీపీ హయాంలో బీసీలకు వృత్తుల వారీగా అభివృద్ధికి ఎంతో చంద్రబాబు ఎంతో కృషిచేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలు టీడీపీని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ బీసీ నాయకులు నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే హేమలత, రామాంజుల నాయుడు, గోపినాథ్‌రెడ్డి, కిరణ్, వెంకటకృష్ణయ్య, సాధు, కందస్వామి, బాలజీ, సురేష్ రెడ్డి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

రేణిగుంట, జనవరి28: మండలంలోని ఆర్.మల్లవరం సమీపంలోని మామిడితోటలో ఆదివారం పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో మురళి, శంకర్‌రెడ్డి, శ్యాంకుమార్, మధు, బుజ్జిబాబు ఉన్నారు. నిందితుల నుంచి రూ.5,120 నగదు స్వాధీనం చేసుకున్నారు. అర్బన్ సీఐ సుబ్బారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

ఏర్పేడు, జనవరి 28: ఏర్పేడు మండలంలో ఆక్రమణలను అడ్డుకుని ప్రభుత్వ భూములను కాపాడాలని సీపీఎం సీనియర్ నాయకురాలు, రాష్ట్ర కమిటీ సభ్యులు కలపాటి గురవమ్మ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. కోబాక, చిందేపల్లి, మునలిపేడు, వికృతమాల తదితర గ్రామాల్లో ఉన్న శ్మశానాలను సైతం అక్రమార్కులు వదలడం లేదని పేర్కొన్నారు. శ్మశానాల స్థలాలను కబ్జా చేసి దర్జాగా ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారని తెలియజేశారు. అలాంటి వాటిపై రెవెన్యూ అధికారులు దృష్టిసారించాలని ఆమె కోరారు.

మద్యం స్వాధీనం.. ముగ్గురిపై కేసు

తొట్టంబేడు, జనవరి 28: మండలంలోని తొట్టంబేడు పంచాయతీ బీడీకాలనీలో ఇంటి వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వెంకటేష్ (23)ను పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రాఘవేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏర్పేడు: 14 బండవానిపల్లి గ్రామంలో ఓ దుకాణంలో 14 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి చెంగయ్యపై ఏర్పేడు ఎస్ఐ జిలానీ కేసు నమోదు చేశారు.

వరదయ్యపాళెం: వరదయ్యపాళెం మండల కేంద్రంలోని బీసీకాలనీలో పోలీసులు 17మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. బెల్టు షాపు నిర్వహిస్తున్న వంజవాకం గణేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడిని రిమాండ్‌కు తరలించారు.

చిన్నారిపై అత్యాచారయత్నం కేసులో నిందితుడి అరెస్టు

ఏర్పేడు, జనవరి 28: ఏర్పేడు మండలంలోని ఓ గ్రామానికి చెందిన దళిత వర్గానికి చెందిన ఎనిమిదేళ్ల చిన్నారిపై అదే గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా(40) అలియాస్ బాటోడు అత్యాచార యత్నం చేసిన విషయం తెలిసిందే. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు నిందితుడిపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఆదివారం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. సోమవారం రిమాండ్‌కు పంపనున్నట్లు ఎస్ఐ జిలానీ తెలిపారు.

బండారుపల్లి టీచర్‌కు నేతాజీ అవార్డు



టీచర్ సుబ్రహ్మణ్యం

ఏర్పేడు, జనవరి 28: బండారుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఎం.సుబ్రహ్మణ్యంను నేతాజీ సుభాష్ చంద్రబోస్ మెమోరియల్ అవార్డు వరించింది. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన సహారా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ అవార్డును సుబ్రహ్మణ్యంకు ప్రదానం చేశారు. ఈ అవార్డును ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ అఖ్లాక్ అహమ్మద్ అందజేశారు.

నిత్యావసరాల పంపిణీ

శ్రీకాళహస్తి, జనవరి 28: శ్రీకాళహస్తి నగిరి వీధిలోని హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు, దివ్యాంగులకు నిత్యావసరాలు అందించారు. బొజ్జల గోపాల కృష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ విచ్చేసి నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఆ సంస్థ నిర్వాహకులైన మునీర్‌బాషాకు రూ.10వేల ఆర్థికసాయం అందించారు. అనంతరం ఇటీవల తల్లిని కోల్పోయిన మునీర్‌బాషాను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునిరాజనాయుడు, కాసరం రమేష్, బుజ్జి, న్యాయవాది గరికపాటి రమేష్‌బాబు పాల్గొన్నారు.

నమ్మి అప్పగిస్తే.. ఇంత నిర్లక్ష్యమా

● తుడ నిర్వాకంపై రెవెన్యూ అసంతృప్తి
● కరకంబాడిలో ఆక్రమణలపై ఆగ్రహం



గుడెసెలు వేసిన పేదలతో చర్చిస్తున్న తహసీల్దార్ ఉదయ్‌సంతోష్, పోలీసులు (ఫైల్‌ఫొటో)

రేణిగుంట, జనవరి28: నమ్మి భూములు అప్పగిస్తే నిర్లక్ష్యం వహించిన తుడాపై రేణిగుంట రెవెన్యూ అధికారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కరకంబాడిలో మూడు రోజులుగా ప్రభుత్వ భూమిలో పేదలు గుడిసెలు వేయడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. రేణిగుంట మండల పరిధిలోని కరకంబాడి పంచాయతీ కార్యాలయానికి సమీపంలో కడప రహదారికి ఆనుకుని ఉన్న కరకంబాడి లెక్కదాఖలా సర్వే నెంబరు 153/1 లో 70.70 ఎకరాలను 2009 నవంబరులో తుడాకు రెవెన్యూ అధికారులు కేటాయించారు. ఆ భూమిని అభివృద్ధి చేసి ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ ఇప్పటివరకు తుడ పాలక మండలి చిన్న అభివృద్ధి పని కూడా చేయలేదు. కనీసం తుడ బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. కనీసం తమకు అప్పగించిన స్థలాలు ఆక్రమించుకుంటున్నా పట్టించు కోవడం లేదు. అదే సమయంలో రేణిగుంట మం డలం నుంచి తుడకు లక్షల రూపాయల నిధులు జమచేస్తున్నారు. తుడ పాలక మండలి మాత్రం తమకు అనుకూలమైన ప్రాంతంలోనే వివిధ అభి వృద్ధి పనులు చేసుకుంటోందనే విమర్శలున్నాయి.

రెవెన్యూ అధికారుల సతమతం

తుడా నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకొని కొందరు నకిలీ భూహక్కు పత్రాలను సృష్టించి కబ్జాలకు పాల్పడుతున్నారు. 14 ఏళ్లుగా తుడ పాలకమండలి ఈ భూమిని అభివృద్ధి చేయకపోవడంతో లక్షల విలువ చేసే గ్రావెల్‌ను కొందరు సొమ్ము చేసుకున్నారు. ఇదే సమయంలో ప్రభుత్వం మూడేళ్ల క్రితం జగనన్న ఇంటిపట్టాలు పేదలకు పంపిణీ చేసింది. అందులో సుమారు 4వేలకు పైగా లబ్ధిదారులకు నేటివరకు ఇంటి స్థలాలు చూపలేదు. దీంతో కరకంబాడి గుట్టపై పేదలు సీపీఎం ఆధ్వర్యంలో గుడిసెలు వేశారు. రెవెన్యూ అధికారులు పోలీసుల సాయంతో ఆ గుడిసెలు తొలగించారు. అయితే ఆ భూమిని పొందిన తుడ అధికారులు గానీ, పాలక మండలి గానీ అటువైపు కన్నెత్తి చూడలేదు. ఇటు అప్పగించిన భూమిని కాపాడు కోవడంతో పాటు పట్టాలు పొందిన వారికి స్థలాలు చూపడం రెవెన్యూ అధికారులకు సమస్యగా మారింది. ఇప్పటికైనా తుడ వారు స్పందించి కరకంబాడి గుట్టను అభివృద్ధి చేసి రక్షణ కల్పించాల్సి ఉంది. అలాగే పట్టాలు పొందిన వారికి రెవెన్యూ వారు స్థలాలు చూపాల్సి ఉంది.

కురకాల్వలో ఆక్రమణల తొలగింపు



ప్రజలో మాట్లాడుతున్న వైసీపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి

రేణిగుంట, జనవరి28: రేణిగుంట మండలం జీపాళెం పంచాయతీ పరిధిలోని కుర్రకాలువ రెవిన్యూ లెక్కదాఖలా సర్వే నెంబరు 213-3లో వున్న ఖాళీ స్థలంలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను ప్రజలు స్వచ్ఛందంగా తొలగించారు. వారికి కొందరు వైసీపీ నాయకులు అండగా నిలిచారు. అయితే ఆక్రమలు తొలగించరాదని మరో వర్గం వైసీపీ నాయకులు పోలీసులను ఆశ్రయించడంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆక్రమణలు తొలగించిన వారితో చర్చలు జరిపారు. సమస్య ఉంటే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలని ఇలా తొలగించడం తగదని స్పష్టం చేశారు. దీంతో పంచాయితీ పోలీసు స్టేషన్‌కు చేరింది. అక్కడ వైసీపీ నాయకులు డీసీసీబీ మాజీ ఛైర్మన్ ఎస్.సుధాకర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యులు తిరుమలరెడ్డి మాట్లాడుతూ ఆక్రమణలు తొలగిస్తే అడ్డుకోవడం తగదన్నారు. పంచాయతీలో అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేసేందుకు రెవెన్యూ వారితో మాట్లాడి సమస్య పరిష్కరిం చాలని కోరారు. అనంతరం సీఐ సుబ్బరాయుడుకు వినతిపత్రం అందజేశారు. గతంలో పట్టాలు పొందిన వారికి నాలుగు రోజుల్లో ఇంటి స్థలాలు చూపకపోతే తామే ప్రభుత్వ స్థలాలు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు.

నవసమాజ నిర్మాణమే వికసిత్ భారత్ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న కోలా ఆనంద్

తొట్టంబేడు, జనవరి 28: నవ సమాజ నిర్మాణమే వికసిత్ భారత్ లక్ష్యమని బీజేపీ రాష్ట్రకార్యదర్శి, శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కోలా ఆనంద్ అన్నారు. శ్రీకాళహస్తి పట్టణం పీవీ రోడ్డు సచివాలయంలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. కోలా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ప్రధాని మోదీ పేదల కోసం ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డులను ప్రవేశపెట్టారన్నారు. ఉజ్వల పథకం కింద గ్యాస్ కనెక్షన్‌లు, రేషన్ బియ్యం, ఆవాస్‌యోజన కింద పేదలకు ఇళ్లు కేంద్ర ప్రభుత్వమే అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో-కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు గరికపాటి రమేష్‌బాబు, అమ్మపాళెం రమణారెడ్డి, రమణ, సుకుమార్, అమర్నాథ్, అయ్యప్ప, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పల్లికొండేశ్వరాలయంలో వార్షికోత్సవ పూజలు



కళశాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న అర్చకులు

నాగలాపురం, జనవరి 28: మండల పరిధిలోని సురుటుపల్లె పల్లికొండేశ్వ రాలయంలో కుంభాభిషేకం జరిగి ఆదివారంతో 5 సంవతాలు పూర్తయ్యాయి. దీంతో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం తమిళనాడు రాష్ట్రం ముడుచ్చూరు ఆగమ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీషణ్ముగం వారి శిష్య బృందంతో విఘ్నేశ్వర పూజ, రుద్రపారా యణం నిర్వహించారు. అనంతరం అర్చక బృందం కలశాలను ఆలయ ఆవరణలో ఊరేగింపుగా తీసుకెళ్లి ఏకాదశి హోమం, కలశాభిషేక కార్యక్రమాలను శాస్త్రోక్తకంగా నిర్వహించారు. వాల్మీకేశ్వర స్వామి, మరగదాంబికా అమ్మవార్లను సుందరంగా ముస్తాబు చేశారు. మహా దీపా రాధనలు చేపట్టారు. ఈ పూజలను ఆలయ ఛైర్మన్ ఏవీఎం బాలాజీరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు.

వైసీపీలో బడుగుల పట్ల వివక్ష



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పిచ్చాటూరు, జనవరి 28: వైసీపీలో బడుగు, బలహీనుల పట్ల వివక్ష ఎక్కువగా ఉందని టీడీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు గొల్ల నరసింహయాదవ్ పేర్కొన్నారు. ఆదివారం పిచ్చాటూరు టీడీపీ పార్టీ కార్యాలయంలో టీడీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాజీ ఏఎంసీ ఛైర్మన్, క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్ రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆది నుంచి అధికార వైసీపీ బడుగు బలహీన వర్గాలపై వివక్ష చూపడం అందరికీ తెలుసన్నారు. ఇప్పటికైనా మనలో కను విప్పు కలగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే హేమలత, ఇన్‌చార్జి హెలెన్, టీడీపీ రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామియాదవ్, తిరుపతి జిల్లా పాలేగార్ సంఘ అధ్యక్షుడు వెంకటకృష్ణయ్య, నాయకులు గిరిబాబు, వాసు పాల్గొన్నారు.

కాలువల నిర్మాణానికి భూమిపూజ



పనులు ప్రారంభిస్తున్న గుణయాదవ్

ఏర్పేడు, జనవరి 28: ఆమందూరు పంచాయతీ బీసీకాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. దీంతో టీడీపీ యువత అధ్యక్షులు, సర్పంచ్ గుణయాదవ్ తన సొంత నిధులతో సుమారు 150 మీటర్ల డ్రైనేజీ కాలువ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. పదిరోజుల్లో నిర్మాణ పనులు పూర్తి చేసి డ్రైనేజీ సమస్య లేకుండా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాచేటి సుబ్రహ్మణ్యం, కన్నవరం ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి



మృతుడు సిద్ధయ్య (ఫైల్‌ఫొటో)

నాగలాపురం, జనవరి 28: కడుపునొప్పి తాళలేక ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతిచెందాడు. నందనం గ్రామానికి చెందిన సిద్ధయ్య (57) కడుపునొప్పి తాళలేక కనుమ పండుగరోజు తన పొలం వద్ద పురుగులు మందు తాగాడు. గమనించిన స్థానికులు నాగలాపురం ప్రభుత్వా స్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స నిమిత్తం చెన్నైలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. నాగలాపురం ఎస్ఐ ఓబయ్య కేసునమోదు చేశారు.

పెద్దిరెడ్డిని విమర్శించే స్థాయి ఆదిమూలానికి లేదు : సురాజన్

సత్యవేడు, జనవరి 28: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శించే స్థాయి ఎమ్మెల్యే ఆదిమూలానికి లేదని సత్యవేడు మాజీ ఎమ్మెల్యే ఎం.సురాజన్ పేర్కొన్నారు. ఆదివారం సత్యవేడులోని తన ఇంటి వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే ఆదిమూలం విమర్శలను ఖండించారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన కుమారుడు సుమన్‌కుమార్ అరాచకం వల్లే సత్యవేడు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయని ఆరోపించారు. తప్పులన్నీ తండ్రీ కొడుకులు చేసి నిందను పెద్దిరెడ్డిపైకి నెట్టడం భావ్యం కాదన్నారు. మంత్రి పెద్దిరెడ్డిపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

'యువతరం'కు భారత సేవా రత్న పురస్కారం



పురస్కారం అందుకుంటున్న యువతరం సభ్యులు

శ్రీకాళహస్తి, జనవరి 28: శ్రీకాళహస్తికి చెందిన యువతరం సేవా సమితి స్వచ్ఛంద సంస్థకు భారత సేవా రత్న పురస్కారం లభించింది. విశాఖ పట్నంలో ఆదివారం సంస్థ సభ్యులు పురస్కారం అందుకున్నారు. విశాఖ పట్టణానికి చెందిన తానుబెల్లి ఫౌండేషన్ 25వ వార్షికోత్సవం పురస్కరించుకొని నిర్వాహకులు శంకర్ నాయుడు పలువురికి పురస్కారం అందజేశారు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తికి చెందిన యువతరం సేవా సమితి సభ్యులను సత్కరించారు.

పవిత్ర మృతిపై వీడిన మిస్టరీ...!

● పథకం ప్రకారమే హత్య
● నీటిలో ముంచి కడతేర్చిన భర్త

శ్రీకాళహస్తి, జనవరి 28: శ్రీకాళహస్తీశ్వరాలయం సమీపంలోని స్వర్ణముఖి నదిలో అనుమానాస్పదంగా మృతిచెందిన పవిత్ర ఘటనలో మిస్టరీ వీడింది. వివరాల్లోకి వెళితే... వరదయ్యపాళెంకు చెందిన లారీ డ్రైవర్ శ్రీనివాసులు(55), భార్య పవిత్ర (36) తలపై దాడి చేసి గాయపరిచాడు. తిరుపతిలో చికిత్స పొంది 13రోజుల తర్వాత ఆమె డిశ్చార్జ్ అయింది. ముక్కంటి ఆలయం దర్శించుకుని ఇంటికి వెళదామంటూ ఈ నెల 26వ తేదీ శ్రీనివాసులు భార్యను శ్రీకాళహస్తికి తీసుకొచ్చాడు. ఎలాగైనా భార్యను హతమార్చాలని పథకం వేశాడు. మాయ మాటలతో ఆలయం సమీపంలోని చిమ్మచీకట్లో నిర్మానుష్యంగా ఉండే స్వర్ణముఖి నదిలోకి తీసుకెళ్లాడు. నీటిలో ముంచి భార్యను హతమార్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ తర్వాత ఆమెది సహజ మరణంగా చిత్రీకరించేందుకు నీటిలో పడి భార్య చనిపోయిందంటూ నమ్మించే ప్రయత్నం చేశాడు. తొలి నుంచి అతడి ప్రవర్తన తెలిసిన కుటుంబ సభ్యులు మాత్రం శ్రీకాళ హస్తి 1టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ నరసింహారావు కేసు నమోదు చేశారు. మృతురాలి మెడపై గాయాలు ఉన్నట్లు పోస్టుమార్టం సమయంలో వైద్యులు గుర్తించారు. దాని ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో భర్తే చంపేసినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు పక్కా సమాచారం. త్వరలో అరెస్టు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించనున్నారు.

వైసీపీ పాలనలో బీసీలకు వెన్నుపోటు : టీడీపీ



బీసీ చైతన్య రథం ప్రారంభిస్తున్న హెలెన్

సత్యవేడు, జనవరి 28: సీఎం జగన్ బీసీలకు వెన్నుపోటు పొడిచారని సత్యవేడు టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ హెలెన్ విమర్శించారు. సత్యవేడు నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు పరంధామయ్య నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జయహో బీసీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ జగన్ బీసీ కార్పొరేషన్లను ఏర్పాటు చేసినా ఒక్క రూపాయి కూడా రుణాలు అందించలేదన్నారు. సొంత సామాజిక వర్గానికి చెందిన వారిని సలహాదారులుగా నియమించుకుని లక్షల రూపాయల ప్రజాధనాన్ని దోచి పెడుతున్నారని ధ్వజమెత్తారు. బీసీసెల్ అధ్యక్షుడు పరంధామయ్య మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలో బీసీల సంక్షేమం కోసం బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు, బీసీ విద్యార్థులకు విదేశీ విద్య, చేతి వృత్తుల వారికి ఆర్థిక సహాయం, పనిముట్లు అందజేశారన్నారు. మండల కేంద్రాల్లో బీసీ భవనాలు, ఆడ బిడ్డలకు వివాహ సమయంలో ఆర్థిక సహకారంతో అండగా నిలిచిందన్నారు. బీసీలకు సంక్షేమం అందాలంటే వచ్చే ఎన్నికల్లో బీసీలంతా టీడీపీ, జనసేనలకు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హేమలత, రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామియాదవ్, పార్లమెంట్ బీసీసెల్ అధ్యక్షులు సదాశివం, కార్యదర్శి దయానిధి, నాయకులు సుందరరామిరెడ్డి, మస్తాన్, వరలక్ష్మి, షణ్ముగం, శ్రీనివాసయాదవ్, శివ, నరేంద్ర, చిట్టేటి పృథ్వీ వెంకటేశ్వరులు, బాలసుబ్రహ్మణ్యం, దయానిధి, గోవిందచౌదరి, వెంకటకృష్ణయ్య, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.